ప్రజాశక్తి
గురువారం 15 మే 2025
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

రమణరావుకు అశ్రునివాళి

- ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తల పిలుపు
- కడసారి చూసేందుకు తరలొచ్చిన జనం



రమణరావు అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు, ప్రజలు

ప్రజాశక్తి - గాజువాక

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సిపిఎం సీనియర్ నాయకులు పివైవి.రమణరావు అంత్యక్రియలు బుధవారం అశ్రునయనాల నడుమ సాగాయి. ఆయన్ని కడసారి చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు, ఇతర రాజకీయ పార్టీల నేతలు, అభిమానులు చినగంట్యాడకు తరలివచ్చారు. రమణరావు అమర్ రహే అంటూ అంతిమయాత్రలో నినదించారు. విప్లవ జోహార్లు అర్పించారు. తొలుత రమణరావు సంతాప సభ చినగంట్యాడలోని ఆయన ఇంటి వద్ద జరిగింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ రమణరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తాను సిపిఎం జిల్లా కార్యదర్శిగా పనిచేసినప్పుడు తనకు ప్రతి విషయంలోనూ సలహాలు, సూచనలు అందించారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ నిలబడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయనలేని లోటు తీరనిదన్నారు. పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ తామంతా ఒకే కుటుంబంలో కలిసి ఉండేవారిమన్నారు. రమణరావు బిహెచ్‌పివిలో కార్మికుల పక్షాన అనేక పోరాటాలు నడిపారన్నారు. వర్గ పోరాటంతోనే కార్మికులకు మేలు జరుగుతుందని భావించి, ఆ దిశగా పనిచేశారన్నారు. తన కోసం బతకడం కంటే నలుగురి కోసం సహాయపడాలనే లక్ష్యంతో సాగారన్నారు. మెరుగైన సమాజం కోసం పరితపించారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరమూ ప్రజలకు ఉపయుక్తమైన పనులే చేశారన్నారు. ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్ మాట్లాడుతూ రమణరావు మృతి తీవ్ర బాధను కలిగించిందన్నారు. ఆఖరి శ్వాస వరకు పార్టీ కోసమే సేవలందించారని తెలిపారు. ఏ పనినైనా ఆయనే స్వయంగా చేసేవారని గుర్తుచేశారు. పేపర్ బాయ్ రాకపోయినా ఆయనే ప్రజాశక్తి పత్రికను పంపిణీ చేసేవారని తెలిపారు. ఆయన సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

మిగతా 2లో..



రమణరావు పార్థివదేహం వద్ద విలపిస్తున్న సిహెచ్.నర్సింగరావు

ప్రాథమిక తరగతులకు స్కూల్ అసిస్టెంట్లు?

- మిగిలిపోయిన ఎస్‌ఎలంటూ ప్రభుత్వం 'కన్వర్షన్ జీవో 21 విడుదల'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



ప్రాథమిక తరగతులను బోధించేందుకు ఇంటర్, టిటిసి టీచర్లను ప్రభుత్వం నియమించాలి. కానీ బిఇడి చేసే వారిని ప్రాథమిక తరగతులకు వెళ్లాలంటూ స్కూల్ అసిస్టెంట్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసింది. దీనికోసం రాష్ట్ర విద్యాశాఖ జీవో 21ను మంగళవారం విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పూటకో లెక్క, రోజుకో విధానంతో విద్యాశాఖలో నిర్ణయాలు చేస్తూ ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తుందని పలువురు ఉపాధ్యాయుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిపి, జెడ్‌పి స్కూల్స్ కన్వర్షన్ మోడల్ ప్రైమరీ స్కూళ్లలో హెచ్‌ఎంలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఈ తాజా నిర్ణయం తీసుకుంది. దీంతో గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో పాఠశాల విద్యను పేదలకు దూరం చేయబోతుందా? అన్న అనుమానాలు కలిగేలాగ విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టింది.

ప్రైమరీ స్కూళ్లు మూతపెట్టం అంటూనే....

విశాఖలో ఎంపిపి, జెడ్‌పి స్కూళ్లు 252, ప్రభుత్వ స్కూళ్లు 16, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9 మొత్తంగా 277 అవుతున్నాయి. స్కూళ్లు ఎక్కడా మూత పెట్టం అంటూనే 1 నుంచి 5వ తరగతి వరకూ ఉండే ఎలిమెంటరీ స్కూళ్లు స్ట్రక్చర్స్‌ను మార్చేలాగ తాజా జీవో ఉందని యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.అంబేద్కర్ వెల్లడించారు. సబ్జెక్ట్ టీచర్లను తీసుకొచ్చి ఎలిమెంటరీ స్కూల్స్‌లో పెడతామని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి లోకేష్ చెబుతున్నారని ఇది విద్యాశాఖలో కచ్చితంగా 'రివర్స్ పాలసీ' అని అంబేద్కర్ ఎద్దేవా చేశారు. స్కూల్ అసిస్టెంట్‌గా ఉన్నవారి సేవలను హైస్కూల్‌లోనే వినియోగించాలి తప్ప ప్రాథమిక పాఠశాలలకు ఎలా పంపిస్తారు? మిగిలిపోయిన హైస్కూల్ టీచర్లను ఎలిమెంటరీ స్కూళ్లకు హెడ్మాస్టర్లుగా నియామకం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదంటూ పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మిగిలిపోయాయన్నదాంట్లో నిజం లేదని కొఠారీ కమిషన్ విధానం ప్రకారం ఒక తరగతి గదికి 1:40 నిష్పత్తిలో విద్యార్థులుండాలి. కానీ కటాఫ్ 1:53 పెట్టడం చూస్తే తరగతిలో విద్యార్థుల సంఖ్యను ప్రభుత్వం పెంచింది. అంటే అదనపు సెక్షన్లు

మిగతా 2లో..

అల్లూరి స్మారక మందిరానికి రూ. 20 లక్షల కేటాయింపు : అయ్యన్న

వార్త 7లో..

19 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

వార్త 3లో..

లేటరైట్ తవ్వకాలు తక్షణమే ఆపాలి : సిపిఎం

వార్త 5లో..



కోడూరులోని భూమి

ఏకమైపోయారు

- భూ సమీకరణ భూములకు పరిహారం చెల్లింపు
- కూటమి, వైసిపి నాయకుల కుమ్మక్కు
- దీనికి రెవెన్యూ అధికారుల తోడ్పాటు
- 31.38 ఎకరాలకు రూ.6.27 కోట్లు జమ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వ భూమిలో సాగులోలేని కొంతమంది బినామీలను నమోదుచేసి పరిహారం కింద సుమారు రూ.6.27 కోట్లు చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. సాగులోవున్నట్లు చెబుతున్న కోడూరు సర్వే నెంబర్ 20లోని 39.38 ఎకరాల్లో కొద్ది రోజుల క్రితం 31.38 ఎకరాలకు ఎకరాకు రూ.20 లక్షలు చొప్పున చెల్లించిన పరిహారంలో కూటమి, వైసిపి నాయకులు ఏకమైనట్లు తెలుస్తోంది. సాగుదారుల పేర జరిగిన పరిహారం చెల్లింపుల వ్యవహారం బయటకు రాకుండా వుండుందంగా సంప్రదింపులు జరుపుకున్నట్లు సమాచారం. పరిహారం చెల్లించిన అధికారులు వీరికి తోడవడంతో తప్పులన్నీ ఒప్పు అయ్యాయి.

వైసిపి ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు చేసిన భూ సమీకరణ, పారిశ్రామిక అవసరాలకు చేసిన భూ సేకరణలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నట్లు టిడిపి, జనసేన ఆనాడు ఆరోపించాయి. భూ సమీకరణ, సేకరణ అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణ చేపడుతుందని స్థానికులు ఊహించారు. కూటమి నాయకులు ఆ పనిచేయకపోగా వైసిపి నాయకులతో చేతులుకలిపి ప్రజల సొమ్ము లూటీ చేయడానికి అధికారాన్ని అడ్డం పెట్టుకున్నారు. ఇళ్ల స్థలాలకు సమీకరించిన భూమిలో జిరాయితీ, డి పట్టా, సాగుదారులకు అభివృద్ధిచేసిన ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించడంతో వైసిపి నాయకులు రంగంలోకి దిగారు. సాగులోలేని బినామీలను సృష్టించారు. అనకాపల్లి మండలం కోడూరు రెవెన్యూలో సర్వే నెంబరు 20లో ఎపిఐఐసికి చెందిన 39.38 ఎకరాల్లో ప్లాట్‌లు కొట్టడానికి ప్లాన్ వేశారు. అప్పటికే

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రమణరావుకు అశ్రునివాళి


రమణరావు పార్థివదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, ఐద్వా నాయకులు

మాట్లాడుతూ రమణరావు ప్రమాదానికి గురైతే గాజువాకలోని ఓ ఆసుపత్రికి వెంటనే తరలించామని, మెరుగైన వైద్యం కోసం విశాఖ నగరంలోని వేరే ఆసుపత్రికి తరలించే క్రమంలో మృతిచెందారని తెలిపారు. గాజువాకలాంటి పారిశ్రామిక ప్రాంతంలో అధునాతన ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రి లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఈ విషయమై ఆలోచించాలన్నారు. 1985 నుంచి రమణరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సెయింట్ జోసెఫ్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ జోసఫ్ మాట్లాడుతూ రమణరావు తమ ఐటిఐలో అనేక మంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించారన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ సుందరయ్య కాలనీ, స్వతంత్ర నగర్, బానోజీ తోట వంటి కాలనీల్లో జరిగిన పోరాటాల్లో రమణరావు కీలకపాత్ర పోషించారన్నారు. స్నేహపూర్ కాలనీని ఆయనే నిర్మించారని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైసిపి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, సిపిఐ కార్పొరేటర్ స్టాలిన్, ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు.

ఘన నివాళి

తొలుత రమణరావు పార్థివదేహంపై కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు పార్టీ జెండా కప్పారు. జోహార్ రమణరావు, సాధిస్తాం మీ ఆశయాలను అంటూ నినదించారు. రమణరావు సేవలను స్మరిస్తూ ప్రజానాట్యమండలి కళాకారులు చంటి, స్టాలిన్, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గేయాలు ఆలపించారు. రమణరావుకు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, సిపిఎం నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్, ఎస్.జ్యోతీశ్వరరావు, ఆర్.శంకరరావు, కె.కిరీటం, బంగారునాయుడు, బలివాడ వెంకటరావు, కె.నర్సింగరావు, కె.అప్పారావు, ఎస్.విజయ్‌కుమార్, కె.సంతోషం, బి.శరత్, పి.శేషారత్నం, నరసింహారావు, కోటేశ్వరరావు, జయలక్ష్మి, ఎ.లోకేశ్వరరావు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు వై.సత్యనారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు జి.రమణ, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఎస్‌వికె.పరశురాం, డాక్టర్ రమేష్ కుమార్ నివాళి అర్పించారు. సంతాప సభ అనంతరం చినగంట్యాడ నుంచి రమణరావు అంతిమయాత్ర మొదలైంది. సిపిఎం గాజువాక కార్యాలయం వద్ద రమణరావు పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం కొద్దిసేపు ఉంచారు. అనంతరం వంద అడుగుల రోడ్డులోని శ్మశానవాటిక వరకూ అంతిమయాత్ర సాగింది. రమణరావును కడసారి చూసేందుకు పెద్ద సంఖ్యలో సిపిఎం, ప్రజా సంఘాల కార్యకర్తలు తరలివచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

దేహదానం చేయాల్సి ఉన్నప్పటికీ..

రమణరావు ఆదర్శవాది. మరణానంతరం తన శరీరం వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడాలని భావించి దేహదానం చేసేందుకు ముందుకొచ్చారు. అయితే రోడ్డు ప్రమాదంలో ఆయన శరీరం తీవ్రంగా దెబ్బతినడంతో ఆ వీలు లేకుండా పోయింది.

ప్రాథమిక తరగతులకు స్కూల్ అసిస్టెంట్లు?

ఇలా తగ్గిపోవడంతో పోస్టులు (ఎస్ఎ)లు మిగిలిపోయినట్టు చూపిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. మరో సెక్షన్ ఇవ్వాల్సిన పనిలేకుండా స్కూల్ అసిస్టెంట్ మిగిలిపోయినట్టు ప్రభుత్వం చెబుతూ వీరిని ఎలిమెంటరీకి పంపుతున్నామని తొలగించడం లేదని చెప్పడం చూస్తే అవసరమైన, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వేల కొద్దీ టీచర్ పోస్టులు తీయాల్సిన పని ప్రభుత్వానికి లేకుండా పోయింది.

ఏకమైపోయారు

ఈ భూమిని ఒకరు కొనుగోలు చేయడంతో వివాదస్పదమైంది. కోడూరులో సర్వే నెంబరు 20లోని 39.38 ఎకరాలు ప్రభుత్వ భూమిగా 2003లో రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటుచేశారు. తరువాత ఎపిఐఐసికి ఈ భూమి దఖలు పడినట్లు సిమెంట్ దిమ్మలు ఏర్పాటుచేశారు. భూ సమీకరణలో కొంతమంది వైసిపి నాయకుల కళ్లు ఈ భూమిపై పడ్డంతో 34 మంది బినామీల పేర నకిలీ పత్రాలు తయారుచేయించారు.

భూ సమీకరణలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఈ అక్రమాలపై అప్పట్లో టిడిపి, జనసేనలు అధికారులకు ఫిర్యాదులు చేశాయి. ఏ భూముల సమీకరణలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆనాడు ఆరోపించారో, అధికారంలోకి వచ్చిన తరువాత అవే భూములకు ఎకరాకు రూ.20 లక్షలు చొప్పున పరిహారం ఇప్పించి సొమ్ము చేసుకోవడానికి కుమ్మక్కయ్యారు. కూటమి, వైసిపికి చెందిన కొందరు నాయకులు కోడూరులో బినామీ రైతులకు పరిహారం ఇప్పించడం విమర్శలకు తావిస్తోంది. పరిహారం చెల్లించే ముందు నిర్వహించాల్సిన పద్ధతులేవీ రెవెన్యూ అధికారులు పాటించలేదు. కోడూరు సర్వే నెంబరు 20లోని వివాదస్పద ఎపిఐఐసి భూములకు చెందిన బినామీలకు అభివృద్ధిచేసిన ప్లాట్‌లు కాకుండా భూ సేకరణ చట్టం కింద నగదు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కూటమికి చెందిన ఒక నాయకుడు చేసిన ఒత్తిడికి సంబంధిత అధికారులు తలొగ్గారు. కొద్ది రోజుల క్రితం కోడూరు సర్వే నెంబరు 20లో భూములిచ్చిన 31.38 ఎకరాలకు చెందిన రైతులను అర్హులుగా గుర్తించి ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారంగా చెల్లించేందుకు రెవెన్యూ అధికారులను ఒప్పించి చెల్లించేలా చేశారు. పరిహారం పొందిన బినామీల నుంచి సొమ్ము తీసుకొని పంచుకొనేలా రెవెన్యూ అధికారులు, కూటమి, వైసిపి నాయకులు సమన్వయం చేసుకున్నట్లు విమర్శలొస్తున్నాయి. అయితే, ఈ అక్రమ చెల్లింపులపై సంబంధిత అధికారులు స్పందించడంలేదు.

పలు రైళ్ల స్టాప్‌ల్లో తాత్కాలిక మార్పు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాజీపేట కొండపల్లి మధ్య మూడవ లైన్ (ప్యాచ్ ట్రిప్లింగ్) నిర్మాణంతో సంబంధం ఉన్న సికింద్రాబాద్ డివిజన్‌లోని మహబూబాబాద్ స్టేషన్‌లో ప్రీ-నాన్ ఇంటర్‌లాకింగ్ (ప్రీ-ఎన్ఐ) నాన్-ఇంటర్‌లాకింగ్ (ఎన్ఐ) పనుల కారణంగా, కొన్ని రైళ్లకు మహబూబాబాద్ స్టేషన్‌లో షెడ్యూల్ చేయబడిన స్టాప్ తాత్కాలికంగా తొలగించి, ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించడానికి, ఈ పనుల సమయంలో కేసముద్రం స్టేషన్‌లో తాత్కాలిక స్టాప్ ఉంటుందని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ క్రమంలో 12727 విశాఖపట్నం-హైదరాబాద్ గోదావరి, 12861 విశాఖపట్నం - మహబూబ్ నగర్, 11020 భువనేశ్వర్- సిఎస్టి ముంబై కోణార్క్, 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 24 నుండి 26వ తేదీ వరకు మహబూబాబాద్‌కు బదులుగా కేసముద్రంలో ఆగుతాయని, మార్పును ప్రయాణికులు గమనించాలని కోరారు.

ఉర్దూ టీచర్ల నియామకానికి పల్లా హామీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్, జడ్‌పి స్కూళ్లలో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ల పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామని గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. బుధవారం ఆవాస్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ప్రతినిధులు పల్లా శ్రీనివాసరావును కలిసి మున్సిపల్, జడ్‌పి స్కూళ్లలో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించి డిఇఒతో వెంటనే మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు సిఫారసు చేస్తూ లేఖ రాయమని తన పిఎకు ఎమ్మెల్యే పల్లా ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆవాజ్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి అశ్రఫ్, సభ్యులు షేక్ రెహమాన్ తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పోరాటాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకుంటామని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1499వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చేస్తామని కేంద్రం నాలుగేళ్ల క్రితం ప్రకటించినప్పటికీ ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందని, దీనికి కార్మికులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు చేసిన పోరాటాలే కారణమన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ఇచ్చిన ప్యాకేజీ కంటి తుడుపుగా ఉందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగదాంబ జోన్ సిఐటియు నాయకులు కె.నరసింగరావు, కె.చంద్రశేఖర్, ఎన్.సంజీవ్, ఎం.చంద్రమౌళి, బి.రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు స్టాపర్లు అందజేత

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విశాఖ సిటీ కమిషనరేట్ పరిధిలో ఉన్న మెడికల్ హాస్పిటల్స్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్)లో భాగంగా నగర సిటీ పోలీసులకు 50 ఐరన్ స్టాపర్లను అందజేశారు. బుధవారం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద సిపి డాక్టర్ శంఖ బ్రత బాగ్చికి అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ఈ స్టాపర్లు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, లా అండ్ ఆర్డర్ విధులు నిర్వహించడానికి, పండుగలు, ఉత్సవాల సమయంలో రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. వీటిని అందించిన మెడికవర్ సెంట్రల్ హెడ్ డాక్టర్ అరుణ్ కుమార్ చెప్పా, క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ మోహన్ మహారాజ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సూర్యప్రకాష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎడిసిపి కె.ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సిఐలు కెఎన్ఎస్‌వి.ప్రసాద్, ఎం.శ్రీను పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దే బాధ్యత కోచ్‌లదే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసి శిక్షణనిచ్చి ప్రోత్సహించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లలో పాల్గొనే కోచ్‌లకు ఎంవిపి.కాలనీలోని తన నివాసంలో బుధవారం స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం గర్వించే క్రీడాకారులను తయారుచేసే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. పద్మనాభంలో వాలీబాల్, రుషికొండలో వాటర్ స్పోర్ట్స్, కొమ్మాది, బక్కన్నపాలెంలలో ఫుట్ బాల్, రేవిడిలో హ్యాండ్ బాల్, చేపలుప్పాడలో ట్రయథలాన్, కొమ్మాదిలో బాక్సింగ్, మధురవాడలో స్కేటింగ్ కోచింగ్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్లు గంటాకు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ జూన్ గాలియట్ వివరించారు. అథ్లెటిక్ కోచ్ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

టాలీ 6.0 విడుదల

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : భారతదేశంలో బిజినెస్ ఆటోమేషన్స్ సాఫ్ట్‌వేర్ ప్రధాన ప్రొవైడర్, చిన్న మధ్య తరహా కంపెనీల ఆర్థిక కార్యకలాపాలను సరళీకృతం చేయడానికి, వారి ఆర్థిక కార్యకలాపాలను సజావుగా నిర్వహించడానికి నిర్వహించబడుతున్న ట్రాలీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తన తాజా వెర్షన్ అయిన టాలీ ప్రైమ్ 6.0 ను మంగళవారం విశాఖలో విడుదల చేసింది. ఈ సందర్భంగా టాలీ ప్రత్యేక స్టోర్ మేనేజర్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, ఈ అధునాతన అప్‌డేట్ కంపెనీలు అకౌంటెంట్ల కోసం బ్యాంకింగ్ ఆటోమేషన్, ఆర్థిక నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందని తెలిపారు. జిఎస్‌టి తయారీ వంటి సేవలను ఇంటిగ్రేటెడ్ బ్యాంకింగ్ సామర్థ్యాలతో దీన్ని తయారు చేసినట్లు పేర్కొన్నారు. చిన్న మధ్య తరహా పరిశ్రమల సాధికారతకు ఇదో ముఖ్యమైన మైలురాయి అన్నారు. నూతన వెర్షన్‌లో వ్యాపార నెట్‌వర్క్‌ను సజావుగా నిర్వహించేందుకు కలెక్టెడ్ బ్యాంకింగ్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని, చిన్న వ్యాపారస్తులకు అనుకూలంగా ఉంటుందని వివరించారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని, డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 17వ రోజైన బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రజ్ఞ, కార్యదర్శి స్వాతి మీడియాతో మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సుధ, మౌనిక, గీత, పూర్ణిమ, కల్పన, దివ్య, శోభ, శశిరేఖ, ఎవాంజెలిన్ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ జాతర ప్రత్యేక బస్సుల ఆదాయం రూ.6 లక్షలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పాడేరు మోదకొండమ్మ జాతరకు విశాఖపట్నం నుంచి నడిపిన ప్రత్యేక బస్సులు ద్వారా రూ.6 లక్షలు వరకు ఆదాయం వచ్చిందని ఎపిఎస్‌ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. బుధవారం ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో భారత వికాస పరిషత్ సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రయాణికులు, సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నం నుంచి అమలాపురానికి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజూ ఉదయం 8:45 గంటలకు అదనంగా ఒక బస్సును వేసినట్లు తెలిపారు. కాకినాడకు ఉదయం 5:15 గంటలకు, సాయంత్రం 4:15 గంటలకు అదనపు బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పాల్గొన్నారు.

ఎర్నిమాంబ జాతరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జ్ఞానాపురం సమీపంలోని శ్రీ ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డివిఎస్.సురేష్ బాబా తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉత్సవాలు ఈ నెల 14 నుండి 18వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు. బుధవారం అమ్మవారి వార్షిక జాతరోత్సవం ప్రారంభమైందని, ఆలయ ప్రాంగణంలో భక్తి సంగీత విభావరిని ఏర్పాటుచేశామని తెలిపారు. 15న అమ్మవారికి నీలధార సమర్పణ, 16న మూలమంత్ర హవనములు, సాయంత్రం కూచిపూడి నృత్యప్రదర్శన, 17న తొలేళ్ల ఉత్సవం, 18న జాతర ఉంటాయని వివరించారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

మంచినీటి గెడ్డ మురుగుమయం!



మురుగునీరు ప్రవహిస్తున్న వెంకటేశ్వర కాలనీ దరి మంచినీటి గెడ్డ

- దుర్వాసనతో జనం సతమతం
- ఇళ్లల్లోకి విష సర్పాలు, కీటకాలు
- వెంకటేశ్వర కాలనీ వాసుల అవస్థలు
- మురుగు నీటిని మళ్లించాలని వేడుకోలు

ప్రజాశక్తి -తగరపువలస : ఒకప్పుడు ప్రజలంతా స్నానాలు చేస్తూ, నీటి అవసరాలు తీర్చుకునే గెడ్డ నేడు మురుగునీటిమయంగా మారిపోయిందని జివిఎంసి ఒకటోవార్డు హైవే దరి ఎల్లారమ్మ గుడిని ఆనుకుని ఉన్న వెంకటేశ్వర కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. సలక్షణమైన గెడ్డను దుర్గంధభరితం చేయడంతోపాటు ప్రజలు రోగాల బారిన పడేలా తయారైందని, అంతేకాక విషసర్పాలు, కీటకాలకు నెలవుగా మారి, అవి ఇళ్లల్లోకి చొరబడుతున్నాయని బుధవారం వెంకటేశ్వర కాలనీ వాసులు, మహిళలు ప్రజాశక్తి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేశ్వర కాలనీకి ఆనుకుని ఉన్న గెడ్డలో నీరు కొన్నాళ్ల క్రితం వరకు సలక్షణంగా ఉండేదని స్థానికులు అంటున్నారు. అయితే పట్టణీకరణ ప్రభావంతో బాలాజీ నగర్, ఇతర ప్రాంతాల్లో నివాసాలు, అపార్ట్‌మెంట్ల నుంచి వచ్చే వాడుక నీరు వివిధ కాల్వల ద్వారా ఇదే గెడ్డలోకి చేరడంతో, నానాటికీ మంచినీటి గెడ్డకాస్తా మురుగుమయంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు అన్ని నీటి అవసరాలను తీర్చే గెడ్డ కాస్తా, ఇపుడు దుర్వాసన వెదజల్లుతూ సమీపకాలనీ వాసులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన చెందుతున్నారు. గెడ్డలోకి చేరిన మురుగునీరు ముందుకు పారకుండా నెలల తరబడి నిల్వ ఉండిపోవడంతో మరింత ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. ఒక్కోసారి భోజనం కూడా సహించడం లేదని వారంటున్నారు. మురుగు నీటిని మళ్లించాలని జివిఎంసి అధికారులను కోరుతున్నారు.

పాము, పుట్ర ఇళ్లల్లోకి వస్తున్నాయి..

మురుగుమయంగా మారిన గెడ్డవైపు ప్రజలెవ్వరూ వెళ్లకపోవడం, గెడ్డను వాడకపోవడంతో కాలక్రమేణా గెడ్డలో దట్టంగా తుప్పలు పేరుకుపోయి పాములు, కీటకాలకు ఆవాసంగా మారి, తరచూ తమ ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇళ్ల చుట్టూరా, గెడ్డకు అనుకుని దట్టంగా పెరిగిన తుప్పలు తొలగించాలని వారు కోరుతున్నారు.

దుర్వాసనతో ఇబ్బందులు



గెడ్డలోమురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. ఒక్కోసారి భోజనం చేస్తే సహించడం లేదు. పిల్లలు రోగాల బారిన పడుతున్నారు.

-వై ప్రకాష్,
వేంకటేశ్వర కాలనీ

తుప్పలను తొలగించాలి



కాలనీని ఆనుకుని ఉన్న గెడ్డ నిండా తుప్పలు పేరుకు పోవడంతో పాములు, పురుగు లకు నెలవుగా మారింది. అవి ఇళ్లల్లోకి రావడంతో భయమేస్తోంది.తుప్పలు తొలగించాలి.

- పిల్లా. పద్మ,
వేంకటేశ్వర కాలనీ.

మురుగు నీటిని మళ్లించాలి



గెడ్డలోకి మురుగు నీరు రాకుండా మళ్లించాలి. కొన్నాళ్లకు గెడ్డ మళ్లీ పూర్వపు స్థితికి వచ్చే అవకాశం ఉంది. జివిఎంసి అధికారులు తగు చర్యలు చేపట్టాలి. ప్రజల్లో అవగాహన కల్పించాలి

-గిడుతూరి శ్రీనివాసరావు
వెంకటేశ్వర కాలనీ

సమస్యలపై మేయర్‌కు వినతి



మేయర్ పీల్లాకు వినతిపత్రం అందజేస్తున్న నూకరాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడోవార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదేవార్డుకు చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు ఈ మేరకు బుధవారం జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావును ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు.వార్డు పరిధిలోని రెల్లివీధి, నేరెళ్ళవలస కాలనీ, బోయవీధి, తోటవీధి, గొల్లవీధి, ఎగువపేట, కృష్ణా కాలనీ తదితర ప్రాంతాల్లో సామాజిక భవనాలు, మరుగుదొడ్లు, సిమెంట్ రోడ్లు, కల్వర్టులు, కాల్వల నిర్మాణం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో క్రీడాకారులకు ప్రత్యేకంగా దుస్తులు మార్చుకునే గది, తాగునీటి సదుపాయం, విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-మధురవాడ: కొమ్మాది విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 16న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ అపరేషన్స్ విభాగం ఇఇ పోలాకి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. కొమ్మాది జంక్షన్, శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీ, జిసిసి లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, హౌసింగ్ బోర్డు కాలనీ, అమరావతి కాలనీ, సేవానగర్, డ్రైవర్స్ కాలనీ (సాయిరాం కాలనీ), కె1,2,3కాలనీలు, నవోదయ స్కూల్, చైతన్య ఇంజినీరింగ్ కాలేజ్, సిఆర్‌పిఎఫ్ పోలీస్ బెటాలియన్, కొమ్మాది విలేజ్, దేవిమెట్ట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే మహిళ మృత్యువాత

- ఎన్‌హెచ్ ఆసుపత్రి ఎదుట బాధిత కుటుంబీకుల ఆందోళన



ఎన్‌హెచ్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు

ప్రజాశక్తి -తగరపువలస : తన భార్య రేవతి మరణానికి ఎన్‌హెచ్ ఆసుపత్రిలోని కొంత మంది వైద్యులు, యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మృతురాలి భర్త దివీస్ ఉద్యోగి జనార్ధన్, తోటి స్నేహితులు, బంధువులు బుధవారం రాత్రి ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు.

మృతురాలి భర్త జనార్ధన్ కథనం ప్రకారం.. చిట్టివలస బొగ్గు రోడ్డు, సుఖీభవ అపార్ట్‌మెంట్‌కు చెందిన యర్రంశెట్టి రేవతి (24) ఇటీవల ప్రమాదవశాత్తూ బాత్ రూమ్‌లో కాలు జారి పడింది. వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో చేర్పించారు. కుడి మోచేతికి ఫ్రాక్చర్ కావడంతో దానికి చికిత్స చేయగా, వైద్యం వికటించి అపస్మారక స్థితికి రేవతి చేరుకుంది. అయితే తనకు చెప్పకుండానే తన భార్య రేవతిని విశాఖలోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లారని, అక్కడ బుధవారం మృతి చెందిందని ఆరోపిస్తున్నాడు.మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారని అంటున్నాడు.



మృతురాలు రేవతి (ఫైల్)

తన భార్య మరణంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జనార్ధన్ కోరుతున్నాడు. బుధవారం రాత్రి అనిల్ నీరుకొండ ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేపట్టాడు.. వీరి ఆందోళనకు సిఐటియు, మాల మహానాడు నేతలు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, మాల మహానాడు నాయకులు భాగం గోపాలరావు పాల్గొన్నారు.

19 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - అరిలోవ : ఈ నెల 19వ తేదీ నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. వీటితో పాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా జరుగుతాయన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా 27 కేంద్రాల్లో ఈ నెల 19 నుంచి 28వరకు, ఉయదం 9.30 గంటలనుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని డిఇఒ సూచించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు 19 నుంచి 24వరకు, ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని ఓపెన్ స్కూల్ సొసైటీ సంచాలకులు నరసింహారావు తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు 26 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9.30గంటల నుంచి 12.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. 9 కేంద్రాల్లో జరిగే ఓపెన్ టెన్త్ పరీక్షలకు 640 మంది, 5 కేంద్రాల్లో నిర్వహించనున్న ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు 814 మంది హాజరవుతున్నారనిఓపెన్ స్కూల్ సొసైటీ సంచాలకులు నరసింహారావు వివరించారు.

నేరాలు ఘోరాలు

పోస్టాఫీసులో చోరీ నిందితుల అరెస్టు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాది సబ్ పోస్ట్ ఆఫీస్‌లో గత నెల 17వ తేదీన చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్ఐ ఏ.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. వడ్డాది ఎస్సీ కాలనీకి చెందిన ముగ్గురు యువకులు వడ్డాది సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఏప్రిల్ 17వ తేదీన చొరబడి పోస్ట్ ఆఫీస్‌కి సంబంధించిన రూ.67,855 నగదును చోరీ చేశారు. సిసి ఫుటేజీలో తదితర మార్గాల్లో పరిశీలించి చోరీ చేసిన నగదును స్వాధీనం చేసుకొని చోరీకి పాల్పడిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ చోరీ కేసును చేదించడంలో హెడ్ కానిస్టేబుల్ అర్జున్, గణేష్ వెంకట్ తదితరులు ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో అదనపు ఎస్ఐ ఎన్ భాస్కర్, కనక పాల్గొన్నారు.

ఇంటి దొంగతనాల నిందితునికి రిమాండ్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : రెండు తెలుగు రాష్ట్రాలలో వరుస ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు విశాఖపట్నం క్రైమ్ ఎడిసిపి మోహనరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఎంవిపి పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మధురానగర్‌లోని రాజమాధవ్ టవర్స్‌లో నివాసముంటున్న ఎం.కృష్ణ ఇంటిలో ఈ ఏడాది మార్చి 1వ తేదీన చోరీ జరిగిందని, ఇంటిలోని 23 తులాల బంగారం, లక్ష రూపాయలు నగదు పోయినట్లు ద్వారకానగర్ క్రైమ్ పోలీసులకు యజమాని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. క్రైమ్ ఏసిపి లక్ష్మణరావు ఆదేశాల మేరకు ద్వారకా క్రైమ్ పోలీసులు దర్యాప్తు జరిపి సాంకేతిక ఆధారాలు సహాయంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన పాత నేరస్తుడు తిప్పరాజు రామకృష్ణ అలియాస్ రాము అలియాస్ అభిరామ్ అలియాస్ శ్రీనుగా గుర్తించారు. మంగళవారం అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరు పరచగా ఆయనకు రిమాండ్ విధించారు.

ఈ కేసు విచారణ క్రమంలో మే 6వ తేదీన హైదరాబాద్ ఎస్ఆర్.నగర్ పోలీసులు నిందితుని మేనల్లుడు అశోక్, అక్క భాగ్యమ్మలను అరెస్ట్ చేసి విచారించగా వారి వద్ద విశాఖలో చోరీకి గురైన సొత్తును గుర్తించారు. వారిచ్చిన సమాచారం మేరకు నిందితుడిని మద్దిలపాలెం ప్రాంతంలో ఆరిలోవ ఎస్ఐ హరికృష్ణ, సబ్ డివిజన్ క్రైమ్ సిబ్బంది పట్టుకున్నారు. అతని నుంచి రూ.3.4 లక్షల నగదు, 77.5 గ్రాముల రెండు బంగారు నెక్లెస్లు, 9.4 గ్రాముల రెండు బంగారు ఉంగరాలు, 7.3 గ్రాముల చెవి రింగులు, 0.7 గ్రాముల బంగారు లాకెట్టు స్వాధీనం చేసుకున్నారు. మరో 13 వస్తువులను హైదరాబాదులోని పలు బ్యాంకులలో నిందితుడు తనఖా పెట్టాడు. నిందితుడు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు సుమారు 79 ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో చక్కని ప్రతిభ కనబరిచిన పోలీసులను నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, పలువురు ఉన్నధికారులు అభినందించారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఇద్దరు గంజాయి స్మగ్లర్లు నుండి 12 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్ని బాబు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ, స్మగ్లర్లు మునువెంకటప్ప అంజనప్ప, కొప్ప ముత్తు కలిసి ఆరు గంజాయి ప్యాకెట్లను రవాణా చేస్తుండగా వేంపాడు టోల్ ప్లాజా వద్ద పట్టుకుని, గంజాయిని స్వాధీనం చేసుకుని ఇరువురు స్మగ్లర్లను రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ఆహార భద్రత అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు వేపగుంట దరి కృష్ణరాయపురంలోని పేస్ట్రీ చెఫ్‌లో ఆహార భద్రత అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. పెందుర్తి మండల ఆహార భద్రత శాఖ అధికారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పేస్ట్రీ చెఫ్‌లో ఆహార నిల్వలను తనిఖీ చేసి, నాణ్యత లోపాలను గుర్తించారు. అలాగే పేస్ట్రీ చెఫ్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు.చెఫ్‌లోని ఆహార పదార్థాల నమూనాలను సేకరించి విశ్లేషణకు హైదరాబాద్ తరలించినట్లు ఆనంద్‌కుమార్ వెల్లడించారు. పేస్ట్రీ చెఫ్‌లో చికెన్ ఫ్రైడ్ రైస్ తిన్న సహస్ర అనే 11 ఏళ్ల బాలిక అస్వస్థతకు గురికావడంతో ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు జివిఎంసి శానిటరీ ఇన్స్పెక్టర్, విజిలెన్స్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించినట్లు ఆనందకుమార్ తెలిపారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే హోటల్స్, బేకరీల యాజమాన్యాలను ఉపేక్షించేది లేదని, తప్పు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నివేదిక వచ్చిన తర్వాత పేస్ట్రీ చెఫ్ యాజమాన్యంపై ఉన్నతాధికారులు ఫిర్యాదు చేస్తామన్నారు.

సిబిఎస్ఇ ఫలితాల్లో గీతిక సత్తా



గీతికను అభినందిస్తున్న రమాదేవి

ప్రజాశక్తి -మధురవాడ/ భీమిలి: సిబిఎస్ఇ టెన్త్ ఫలితాల్లో నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మధురవాడ బ్రాంచి విద్యార్థిని రఘుపతి గీతిక .486 /500 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపల్ కిషోర్ తెలిపారు మంగళవారం విడుదలైన సిబిఎస్ఇ ఫలితాల్లో జివిఎంసి ఏదోవార్డు కొమ్మాదికి చెందిన గీతిక ఉత్తమ ప్రతిభ చూపింది. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల చైర్మన్ నారాయణ సతీమణి రమాదేవితోపాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. గీతిక తండ్రి రఘుపతి వెంకటరమణ ప్రజాశక్తి ఉద్యోగి కాగా, తల్లి రాజ్యలక్ష్మి ఆశా వర్కర్. కాగా ఇటీవల విడుదలైన ఏపి గురుకులాల ఇంటర్ ప్రవేశపరీక్ష ఫలితాల్లోనూ గీతిక రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచింది.

భూసార పరీక్షలతో ప్రయోజనం

ప్రజాశక్తి- ఆనందపురం : రైతులందరూ తమ భూముల సారాన్ని తెలుసుకునేందుకు రైతు సేవాకేంద్రం సిబ్బంది ద్వారా పరీక్షలు చేయించాలని మండల వ్యవసాయాధికారి సిహెచ్. సంధ్యారత్న ప్రభ సూచించారు. భూసార పరీక్షలతో నేలసారంతోపాటు నేలలో పోషకాల మోతాదును తెలుసుకోవచ్చునన్నారు. తద్వారా పంటలు, ఎరువుల యాజమాన్యానికి అవకాశం ఉంటుందని, తద్వారా పెట్టుబడి వ్యయం తగ్గడంతోపాటు భూసారానికి ఎటువంటి నష్టం జరగకుండా పరిరక్షించుకోవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతు తమ భూవివరాలను నమోదు చేసుకోవాలన్నారు. దీనికి రైతు ఆధార్‌తోపాటు 1బి(భూవివరాలు) పరిశీలిస్తామని, రైతులందరూ విధిగా తమ భూవివరాలు సరిచూసుకోవాలన్నారు.

226వ రోజుకు పోర్టు కార్మికుల దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న పోర్టు కార్మికులు

ప్రజాశక్తి- సీతమ్మధార: విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రయివేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా పోర్టు ఉద్యోగులు, కార్మికులు చేపడుతున్న రిలేదీక్షలు బుధవారం 226వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పోర్టు యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణపై కూటమిలో భాగస్వామ్యంగా ఉన్న రాష్ట్రంలోని టిడిపి, జనసేన నేతలు, కూటమి ప్రభుత్వం కూడా స్పందించాలన్నారు. ఆసుపత్రి ప్రయివేటీకరణ అనైతికమని, టెండర్లను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పోర్టు ఉద్యోగులు, కార్మికుల కృషితో పురోభివృద్ధి దిశగా సాగుతున్న పరిస్థితుల్లో ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కష్టితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యాన్ని ప్రమాదంలో నెట్టేస్తూ పోర్టు ఆసుపత్రిని పిపిపి పద్ధతితో అభివృద్ధి పేరిట ప్రయివేటుకు కట్టబెట్టాలనుకోవడం దుర్మార్గమన్నారు. విశాఖపట్నం నగరాభివృద్ధిలో విశాఖ పోర్టుకీలకమని, ఏటా జివిఎంసికి సగటున రూ.65కోట్ల పన్నులను పోర్టు చెల్లిస్తోందన్నారు. విశాఖ పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, దీని పరిధిలోని ఆసుపత్రిని ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడం అన్యాయమని, దీన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.సత్యనారాయణ, జిసిహెచ్. నాయుడు, రాఘవులు, కెవిఎస్. కుమార్ శంకర్ , జగన్, నరసింహ మూర్తి పాల్గొన్నారు.

నెహ్రూ అవార్డు గ్రహీతలకూ సస్పెన్షన్?

- స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విచిత్రాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో:విశాఖ ఉక్కులో యాజమాన్యం విచక్షణారాహితంగా వ్యవహరిస్తోంది నడానికి తాజాగా కార్మికులపై షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్‌లే నిదర్శనంగా నిలుస్తున్నాయి. దీంతో ఉక్కు ఉద్యోగులు మాత్రమే కాదు, బయట జనం సైతం స్టీల్ యాజమాన్యం అప్రజాస్వామిక పోకడలపై నివ్వెర పోతున్నారు..

ఎలా జరిగిందంటే?...

ఈనెల 20వ తేదీన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా సమ్మె చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. స్టీల్ ప్లాంట్‌లోని అఖిలపక్ష కార్మిక సంఘాలు ఇప్పటికే యాజమాన్యానికి నోటీసులు ఇచ్చాయి. ఆ సమస్య సందర్భంగా కార్మికులను చైతన్య పరచడం కోసం ఈ నెల 13న సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం పెట్టడం తప్పు అని చెబుతూ ఏడుగురు ఉక్కు నాయకులకు షోకాజు నోటీసులు యాజమాన్యం ఇచ్చింది. మీటింగ్‌లో పాల్గొన్నారని నలుగురు కార్మికులను సస్పెండ్ చేశారు.

దీంతో ఇది ప్రజాస్వామ్యమా? నిరంకుశత్వమా? అని కార్మికులంతా ప్రశ్నిస్తున్నారు. ఈ సమావేశం కూడా వారు పనిచేసే స్థలంలోనే యూనియన్ నాయకులు నిర్వహిస్తే తప్పేమిటి? ఆ సమయంలో ఉత్పత్తికి అంతరాయం కూడా కలగలేదు. సస్పెండ్ చేసిన కార్మికులలో ఇద్దరూ నెహ్రూ అవార్డు గ్రహీతలు కూడా ఉన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను నెహ్రూ అవార్డు అందుకున్న కార్మికులను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసం? ఉత్పత్తికి అంతరాయం కలగకుండా పనిచేస్తున్న కార్మికులను అభినందించాల్సింది పోయి ఈ విధంగా ఇబ్బంది పెట్టి కార్మికులను నిరుత్సాహపరిచి ఉత్పత్తి తగ్గిందని వేరే వారికి అమ్మేయడానికి యాజమాన్యం ప్రయత్నిస్తుందా? అనే చర్చ ప్లాంట్‌లో సాగుతోంది.

మూడేళ్ల బాలికకు పునర్జన్మ

- తిరగబడిన కిడ్నీని సూక్ష్మ శస్త్రచికిత్సతో సరిచేసిన కిమ్స్ ఐకాన్ వైద్యులు



బాధిత చిన్నారి, తల్లిదండ్రులతో డాక్టర్ అభిరామ్

ప్రజాశక్తి -గాజువాక : పుట్టుకతోనే మూత్రపిండం ఒకటి తిరగబడి ఉండడంతోపాటు మూత్రనాళాల్లో అడ్డంకి సమస్యతో బాధపడుతున్న మూడేళ్ల బాలికకు ప్రత్యేక సూక్ష్మ ఆపరేషన్ నిర్వహించి కిమ్స్ ఐకాన్ యూరాలజీ విభాగం వైద్యనిపుణులు ప్రాణాలను నిలిపారు. దీనికి సంబంధించి విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో యూరాలజీ నిపుణుడు డాక్టర్ అభిరామ్ కుచ్చర్లపాటి తెలిపిన వివరాలివి.

కిడ్నీల్లో తరచూ నొప్పి రావడం, ఇన్ఫెక్షన్లకు గురవ్వడం, బరువు తగ్గిపోతుండడం వంటి సమస్యలతో బాధపడుతున్న మూడేళ్ల బాలికను కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి ఆమె తల్లిదండ్రులు తీసుకొచ్చారు. తగిన పరీక్షలు చేయగా, పెల్వియూరేటరిక్ జంక్షన్ అబ్‌స్ట్రక్షన్ (పీయూజే అబ్‌స్ట్రక్షన్) అనే సమస్య ఉందని నిర్ధారించారు. కిడ్నీ నుంచి మూత్రకోశానికి వెళ్లే దారిలో అడ్డంకితోపాటు బాలికకు కిడ్నీ సాధారణ స్థితిలో కాకుండా, తిరగబడి ఉంది. దీంతో శస్త్రచికిత్స చాలా సమస్యాత్మకంగా మారింది. మామూలుగా అయితే ఇలాంటి సమస్యలకు ఓపెన్ శస్త్రచికిత్స చేస్తారు. కానీ, పాప వయసు దృష్ట్యా అత్యంత నైపుణ్యంతో మినిమల్లీ ఇన్వేజివ్ శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించినట్లు డాక్టర్ అభిరామ్ తెలిపారు. కేవలం చిన్న రంధ్రాల ద్వారా లాపరోస్కోపిక్ పైలోప్లాస్టీ అనే సూక్ష్మ శస్త్రచికిత్సను చేశారు. దీంతో ఆపరేషన్ వల్ల మచ్చలు పడకపోవడం, తక్కువ నొప్పి, త్వరగా కోలుకునే అవకాశం లభించింది. ముఖ్యంగా, తిరగబడి ఉన్న కిడ్నీ చుట్టూ ఉన్న సున్నితమైన అవయవాలకు ఏమాత్రం దెబ్బ తగలకుండా శస్త్రచికిత్స చేయగలిగామని డాక్టర్ అభిరామ్ వెల్లడించారు. దీంతో బాలిక చాలా త్వరగానే కోలుకోగా, కొద్దిరోజుల్లో డిశ్చార్జి చేశామన్నారు. పోస్టు ఆపరేషన్ పరీక్షల్లో బాలిక కిడ్నీ బాగా చేయడంతోపాటు మూత్రవిసర్జన కూడా సాధారణంగానే జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ఇప్పుడు ఎలాంటి నొప్పి, ఇబ్బంది లేకుండా పాప సంపూర్ణ ఆరోగ్యంతో ఉందని డాక్టర్ అభిరామ్ వెల్లడించారు.

యూనిటీ మాల్ స్థల పరిశీలన

- ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్‌కు ఐదెకరాలు : ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -మధురవాడ : తిమ్మాపురం రామానాయుడు స్టూడియో వద్ద ప్రతిపాదించిన యూనిటీ మాల్ విశాఖకు ఒక మైలురాయిగా నిలుస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఐదెకరాల్లో రూ.172 కోట్లతో నిర్మిస్తున్న ఈ మాల్‌కు కేటాయించిన భూమిని బుధవారం పరిశీలించారు. . ఐదు అంతస్తుల్లో అధునాతనంగా డిజైన్ చేసిన యూనిటీ మాల్‌లో కన్వెన్షన్ సెంటర్, మినీ థియేటర్లు, 62 రిటైల్ స్టోర్స్, ఫిట్నెస్ సెంటర్ తదితరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొండవాలు ప్రాంతంలో ఇచ్చిన ఈ భూమికి కల్పించిన రోడ్డు సదుపాయాలపై అధికారులను ఆరా తీశారు. ఇదే ప్రాంతంలో కొండవాలున ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌కు ఇచ్చిన 5 ఎకరాల భూమిని కూడా పరిశీలించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో కొత్తగా హోటల్స్, రిసార్ట్స్, క్లబ్‌లు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌కు శాశ్వత భవనం కావాలన్న ప్రతినిధుల విజ్ఞప్తికి స్పందిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో కల్చరల్ సెంటర్ కు ఈ భూమిని కేటాయించారని, సాంకేతిక అంశాలు పరిష్కారం కాగానే కల్చరల్ సెంటర్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు.

కాపు భవనానికి త్వరితగతిన నిధులు

ఎండాడ దిశ పోలీస్ స్టేషన్ పక్కన కాపు భవనానికి



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

కేటాయించిన భూమిని గంటా పరిశీలించారు. అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ భవనం ప్రతిపాదన సాధ్యమైనంత త్వరగా కార్యరూపం దాల్చేట్టు చేస్తామని గంటా హామీ ఇచ్చారు. టిడిపి హయంలో కాపు భవనానికి ఎకరం భూమి కేటాయించగా, వైసిపి ప్రభుత్వం దాన్ని సగానికి తగ్గించిందన్నారు. రూ.6 కోట్ల వ్యయంతో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారని, త్వరితగతిన నిధులు మంజూరు చేయించి పనులు మొదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.సంగీత్ మాధుర్, కార్పొరేటర్ లొడగల అప్పారావు, జనసేన వార్డు అధ్యక్షుడు శాఖరి శ్రీనివాస్, రెవిన్యూ, బిసి సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు, ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ ప్రతినిధులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు అప్పలరాజు సంస్మరణ సభ

- హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పెందుర్తి : సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు, మోటార్ ట్రాన్స్ పోర్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు సంస్మరణ సభ గురువారం సాయంత్రం 4 గంటలకు కార్మిక నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద జరగనుంది. ముఖ్య వక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పాల్గొననున్నారు. అప్పలరాజు స్మారక స్తూపాన్ని ఆవిష్కరించనున్నారు. కార్మికులు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సిపిఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి. జగన్ పిలుపునిచ్చారు.

బకాయి చెల్లింపుపై పెన్షనర్ల హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న చౌదరి అప్పారావు

ప్రజాశక్తి- మాధవధార : విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం కళింగనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు మాట్లాడుతూ పోర్టు, డిఎ బి పెన్షనర్స్‌కు 2022 నుంచి 2025 వరకు బకాయిలు చెల్లించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, పోర్టు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా పెన్షనర్స్‌కు సరైన వైద్యం అందడం లేదని, నాసిరకమైన మందులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోర్టు యాజమాన్యం, అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని ప్రభుత్వం ఆధీనంలోనే నడపాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పులి శివప్రకాశరావు, పెన్షనర్స్ పాల్గొన్నారు.

6జి కమ్యూనికేషన్లపై గీతంలో ఎఫ్‌డిపి

ప్రజాశక్తి-మధురవాడ : ఎంబెడెడ్ సిస్టమ్స్, 6జి కమ్యూనికేషన్‌లలో అధ్యాపకులు తమ జ్ఞానం, నైపుణ్యాలను పెంచుకోవడానికి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎఫ్‌డిపి) ఉపయోగపడుతుందనివరంగల్ ఇసిఇ విభాగం ప్రొఫెసర్ శ్రీహరిరావు అన్నారు బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంబెడెడ్ సిస్టమ్స్, 6జి కమ్యూనికేషన్లలో మార్పులపై ఎఫ్‌డిపిలో మాట్లాడుతూ. 6జి ప్రాముఖ్యత, సవాళ్లను, కమ్యూనికేషన్లు, ఆర్ఎఫ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, సిస్టమ్ డిజైన్ అంశాలపై వస్తున్న నూతన సాంకేతిక మార్పులను వివరించారు. 5జి, 6జి సెల్యూలార్ సిస్టమ్‌ల కోసం వైర్‌లెస్ కమ్యూనికేషన్ ఛానల్ అంశాలు, సహకార కమ్యూనికేషన్, అనుకరణ నమూనాలను తదుపరి తరం 6జి వ్యవస్థలను బహిర్గతం చేశారు, పారిశ్రామిక ఎంబెడెడ్ సిస్టమ్‌లలో 4.0 అప్లికేషన్ అభివృద్ధిపై అవగాహన కల్పించారు. వివిధ సంస్థలు, పరిశ్రమల ప్రముఖులు సాంకేతిక రంగం ఎదుర్కొంటున్న దశలో విద్యార్థులు, పరిశోధకులు, కంపెనీలు ఈ టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలకు దారితీయాలని సూచించారు.కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, ఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణి చంద్ర కుమార్, ఎఫ్‌డిపి కన్వీనర్లు డాక్టర్ ఎస్.నీరజ, డాక్టర్ సి.హెచ్.సుధీర్, డాక్టర్ టి.గౌరి, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా

మండల, గ్రామ స్థాయిలో నిరసనలు

రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 20న జరుగు కార్మిక, కర్షక సమ్మెకు మద్దతుగా వ్యవసాయ రంగ రక్షణ కోసం మండల, గ్రామస్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపునిచ్చింది. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ అన్ని పంటల ధరలు పడిపోయి రైతాంగం తీవ్రమైన సంక్షోభంలో పడిందని, ధాన్యం రూ.400 తక్కువకు, పత్తి రూ.2000 తక్కువకు విక్రయించాల్సి వచ్చిందని, సగటున రూ.18 వేలు అమ్మిన మిర్చి ధర ఈ ఏడాది రూ.9 వేలు పడిపోయిందని పేర్కొన్నారు. బార్లీ, పొగాకు కొనే నాథుడే లేడని, అపరాలు, రొయ్యలది అదే పరిస్థితి అంటని తెలిపారు. జీడిపిక్కలు, కోకోగింజలు ధరలకు కంపెనీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ధరల స్థిరీకరణ నిధి రద్దు చేసిందని, ప్రభుత్వ కొనుగోళ్ళు నిలిపివేసిందని, ఫలితంగా కంపెనీల, వ్యాపారుల ఇష్టారాజ్యమైందని పేర్కొన్నారు. కేంద్రం బిజెపి ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్లచట్టాల రద్దు సందర్భంలో మద్దతు ధరల చట్టం చేస్తామని హామీ రాతపూర్వకంగా ఇచ్చి అమలు చేయకుండా ద్రోహం చేసిందన్నారు. రద్దు చేసిన చట్టాలనే మరో రూపంలో దొడ్డిదారిలో అమలుకు పూనుకుంటుందని విమర్శించారు. పంటలు కొనుగోలు వ్యవస్థ మొత్తం కార్పొరేట్ కంపెనీలు, వ్యాపారుల వశమైవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై కార్మిక సంఘాలతో కలిసి ఈ నెల 20న రైతులు, వ్యవసాయ కార్మికులు సమ్మెలో పాల్గొనాలని, ఎక్కడికక్కడ నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు, కో కన్వీనర్ గాడి బాలు, కోరిబిల్లి శంకర్రావు, ఎస్.బ్రహ్మాజీ, పెంటకోట జగన్నాథరావు, బొప్పె ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు



క్రీడా పరికరాలు అందిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ జాహ్నవి

క్రీడా పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా కలెక్టరు కార్యాలయంలో వేసవి క్రీడా శిబిరాల క్రీడాకారులకు క్రీడా పరికరాలను ఇన్‌ఛార్జి కలెక్టర్, జెసి ఎం.జాహ్నవి చేతులమీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్రీడా శిబిరాలను వినియోగించుకొని ఆటలలో బాగా రాణించాలని, భవిష్యత్తులో పతకాలు సాధించాలని కోరారు. ఆటల వలన మనోవికాశం పెరుగుతుందని, ఆరోగ్యం బాగుంటుందని, చదువులో రాణిస్తారని పేర్కొన్నారు. ప్రతి క్రీడా శిబిరానికి రూ.5వేలు విలువైన క్రీడా పరికరాలను పంపిణీ చేశామన్నారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎల్‌వి.రమణ క్రీడా శిక్షణ శిబిరాల వివరాలు తెలియజేశారు. 50 శిక్షణ శిబిరాలకు 982 మంది విద్యార్థులు హాజరుకాగా 612 మంది బాలురు, 370 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. వీరికి 20 క్రీడా అంశాలలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖోఖో జాతీయ స్థాయి రజత పతక విజేత శ్యామ్ ప్రసాద్‌ను ఇంచార్జి కలెక్టరు అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు కె.త్రిమూర్తులు, రెహమాన్, చిరంజీవి, రమేష్ పాల్గొన్నారు.

ఎస్‌జిటి టీచర్లనే హెచ్‌ఎంలుగా నియమించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్‌లను నియమించడం సరికాదని, ఈ పాఠశాలల్లో ఎస్‌జిటి టీచర్లనే హెచ్‌ఎంలు గా నియమించాలని ఏపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 19, 20, 21ల్లో పాఠశాలల పునర్నిర్మాణం అనే పేరుతో తొమ్మిది రకాల పాఠశాలలుగా వాటిని విభజించిందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలలను తొమ్మిది రకాల విభజించడం వలన తల్లిదండ్రులు విద్యార్థులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ తొమ్మిది రకాల పాఠశాలలకు తెలుగు పేరు పెట్టలేకపోవడం శోచనీయమన్నారు. ఫౌండేషన్ స్కూళ్లలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:30 గాను, బేసిక్ ప్రైమరీ స్కూల్స్ లో 1:20 గాను, హైస్కూల్స్‌లో విలీనమైన ప్రైమరీ స్కూల్స్‌లో 1:10 గాను నిర్ణయించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఒకటి నుంచి ఐదు తరగతుల పాఠశాలల్లోనూ ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20గా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు.

లేటరైట్ తవ్వకాలు తక్షణమే ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి : నాతవరం మండలం సరుగుడు ప్రాంతంలో జరుగుతున్న లేటరైట్ తవ్వకాలను తక్షణమే ఆపాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎర్ర బంగారంగా పేరొందిన కోట్లాది రూపాయలు విలువైన లేటరైట్‌ను మైనింగ్ మాఫియా అడవులను నాశనం చేసేసి ఇష్టానుసారంగా తవ్వుకుపోతున్నా అటవీశాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, సంబంధిత శాఖ మంత్రి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నర్సీపట్నంకు చెందిన అధికార పార్టీ కీలకమైన వ్యక్తి వెనుకుండి తవ్వకాలు చేపట్టడంతో అధికార యంత్రాంగం నోరు మెదపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. అనుమతి పొందినది ఎక్కడ, తవ్వకాలు చేస్తున్నది ఎక్కడా? అనేది కూడా అధికారులు పర్యవేక్షించడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో లేటరైట్ తవ్వకాలు చేసినప్పుడు తప్పుబట్టిన టిడిపి ఇప్పుడు మైనింగ్ మాఫియాకు పూర్తిగా అండగా నిలవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తోన్న నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలో ఈ అక్రమ మైనింగ్ సాగుతోందని తెలిపారు. ప్రస్తుతం లేటరైట్ తవ్వుతున్న నాగులకొండ నుంచి లేటరైట్ క్రషింగ్ ప్రదేశం జలదం వరకు అటవీ శాఖ అనుమతులేకుండా చెట్లు నరికి భారీ రహదారి ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్న అటవీ శాఖాధికారులకు చీమకుట్టినట్లయినా లేక పోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా అటవీశాఖ, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులు మైనింగ్ తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేశారు.

సిపెట్ డిప్లమో కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) విజయవాడలో 10వ తరగతి విద్యార్హతతో 3 సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, బి.యస్సీ విద్యార్హతతో 2 సంవత్సరాల వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ అనే 3 కోర్సులకై రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్.శేఖర్ తెలిపారు. ఆన్లైన్ విధానంలో https://cipet25.onlineregistrationform.org/CIPET అనే లింకు ద్వారా మే 29 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కోర్సులకు ఏపి ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందన్నారు. సిపెట్ అడ్మిషన్ టెస్ట్‌ను జూన్ 8 నిర్వహించి అందులో వచ్చిన ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలో గల 150 సీట్లను భర్తీ చేస్తారని తెలిపారు. ఈ కోర్సులను పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్స్ రంగంలో గల బహుళ జాతి సంస్థ అండ్ అనుబంధ సంస్థలలో జూనియర్ ఇంజనీర్ (ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్ అండ్ మేకర్, జూనియర్ ఇంజనీర్ (మైంటెనెన్స్), క్వాలిటీ కంట్రోల్ విభాగాలలో ఇన్‌స్పెక్టర్ వంటి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ప్రారంభ వేతనం రూ. 20,000 నుంచి రూ.25,000 వరకూ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు, ఇతర వివరాలకై 7893586494 నెంబర్లో నేరుగా సంప్రదించాలని సూచించారు.

84వ వార్డు సమస్యలపై మేయర్‌కు వినతి

ప్రజాశక్తి అనకాపల్లి రూరల్ : జివిఎంసి 84వ డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలపై ఆ వార్డు కార్పొరేటర్ చినతల్లి బుధవారం మేయర్ పీలా శ్రీనివాసరావు వినతి పత్రం అందించారు. పిల్లా వారి వీధి, సాంబమూర్తి కోవెలగొల్ల వీధి, కొట్ని వీధి, లక్ష్మీనారాయణ నగర్ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, కాలువలు, విలీన గ్రామాల దీర్ఘకాలిక సమస్యలపై రెండు కోట్లకు ప్రతిపాదనలను టిడిపి 84వ వార్డు ఇన్చార్జ్ మాదంశెట్టి నీలబాబుమేయర్‌కు అందజేశారు.

సిబిఎస్ఇ ఫలితాల్లో సంస్కృతి విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-పరవాడ : సిబిఎస్ఈ పరీక్షా ఫలితాలలో స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన చిరాగ్ సేనాపతి పన్నెండో తరగతిలో 463/500 (92.6) మార్కులు, పదో తరగతి విద్యార్థిని మేక రిషికా 491/500 (98.2), ధ్రువన్ కార్తీక్ 488/500 (97.6), అక్షయ అనురాధ 487/500 (97.4) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వారికి చరవాణి ద్వారా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. సీతాలక్ష్మి, పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు. హిందీ లో ధ్రువన్ కార్తీక్, రిషిత్ దేవ్, తెలుగులో అక్షయ అనురాధ, సైన్స్‌లో మేక రిషికా నూరు శాతం మార్కులు పొందారు. ఒత్తిడి లేని విద్యావిధానంలో కూడా జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తమ విద్యార్థులు నిరూపించారని ప్రిన్సిపల్ తెలిపారు. పదవ తరగతిలో 110 మంది, 12వ తరగతిలో 39 మందితో శత శాతం ఉత్తీర్ణత సాధించినటుల చెప్పారు.



చిరాగ్ సేనాపతి



మేక రిషికా

హైస్కూళ్లు మంజూరుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలానికి స్కూల్ మంజూరు చేయడం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాకు నూతనంగా 33 హైస్కూలు మంజూరు చేయగా, మండలంలోని బవులువాడ, కుంచంగి, ముత్రాసుకాలనీ రామాపురం, సిరసపల్లి గ్రామాల్లో హైస్కూళ్ళ ఏర్పాటు చేయడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన మండల ఇన్చార్జ్ చదరం నాగేశ్వరరావు, పూసపాటి భరత్ బాబు, మంగ ఈశ్వర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడిగా వెంకటరమణ



వెంకటరమణను అభినందిస్తున్న ఎమ్మెల్యే, ఇతర నేతలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : తెలుగుదేశం మండల అధ్యక్షునిగా పెద్దాడ వెంకటరమణ ఎన్నికయ్యారు. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బుధవారం రైవాడ జలాశయ అతిథి గృహం వద్ద టిడిపి అబ్జర్వర్ ఏసుదాసు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమక్షంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నికలు తీవ్ర ఉద్రిక్తతల నడుమ జరిగాయి. ఇప్పటి వరకు పార్టీ అధ్యక్షుడుగా ఉన్న చిటిమిరెడ్డి సూర్యనారాయణ, ఏ.కొత్తపల్లికి చెందిన పెద్దాడ వెంకటరమణ మండల అధ్యక్ష పదవికి పోటీపడ్డారు. ఏకాభిప్రాయం రాకపోవడంతో మండలంలో 3 పంచాయతీల మినహా, 24 పంచాయతీల నుంచి గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శుల అభిప్రాయాలను స్వీకరించారు. మెజారిటీ పెద్దాడ వెంకటరమణకు రావడంతో ఆయన పేరును పార్టీ అబ్జర్వర్ ఏసుదాసు ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన పెద్దాడ వెంకటరమణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, శరకాన సూర్యనారాయణ, దేవరాపల్లి సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, కొమార బాబురావు, చల్లా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బుచ్చయ్యపేట గ్రామ కమిటీ అధ్యక్షునిగా గాడి

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట గ్రామ టీడీపీ అధ్యక్షులుగా గాడి సూరి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన గత రెండు పర్యాయలు అధ్యక్షులుగా పని చేశారు. బుధవారం గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా శనివాడ శ్రీనివాసరావు, కార్యదర్శిగా సుంకర అప్పారావు (చిన్న), ట్రెజరర్ గా తాటికొండ కాంతారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకర లక్ష్మి, మాజీ సర్పంచ్ దొంకిన అప్పలనాయుడు, సుంకర బాబ్జి, సానాపతి మణికంఠ, వియ్యపు రామారావు పాల్గొన్నారు.



గాడి సూరి అప్పారావును అభినందిస్తున్న దృశ్యం

మునగపాకలో 'జనవాణి'

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జనవాణి (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం జరిగింది. మండల వ్యాప్తంగా 53 మంది సమస్యలను పరిష్కరించాలంటూ ఎంపీడీవో ఉపారాణికి తమ అర్జీలను అందజేశారు. జనసేన పార్టీ మండల అధ్యక్షులు టెక్కలి పరశురాం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రరావు, మొల్లేటి ఆనంద్, ఎల్లపు సంతోష్, వేగిళ్ళ, కాశీ, రవి, అప్పలనాయుడు, పి.ఆర్.డి.ఎ వీరభద్రరావు, ఆర్డబ్ల్యూఎస్ ప్రసాద్, డిటి శేషు కుమార్, పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు

జెజెఎం పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల ఇందిరా నగర్ (రాజీవ్ నగర్)లో జల్ జీవన్ మిషన్ నిధులతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు పనులకు గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అన్నపూర్ణ బ్యాంక్ మాజీ ఛైర్మన్ పిడి గాంధీ, వార్డ్ మెంబర్లు ముత్యాల వెంకటలక్ష్మి, ఖండేలా గోవిందమ్మ, తగ్గా సత్యారావు, వార్డ్ మెంబర్లు, ఎంపిటిసిలు, కట్టుమూరి నాగరాజు, కందిపూడి జగ్గారావు, దిమ్మల అర్జునరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

తురకలపూడిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి గ్రామంలో పిఠాపురం ఎస్‌సిబి చర్చ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. పాస్టర్ పవన్ కుమార్ డాక్టర్లకు సన్మానం చేసి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గంట్ల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ బుదిరెడ్డి నాగభూషణం,తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులు, విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

గ్రీన్ హిల్స్ అపార్టుమెంట్‌లో మాక్ డ్రిల్

ప్రజాశక్తి -అనకాపల్లి : ఉగ్రదాడులు, విపత్తులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యన్నారాయణరావు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. అనకాపల్లి పట్టణం బైపాస్ రోడ్డులోని గ్రీన్ హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్లో బుధవారం శేషాద్రి బ్లాక్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. అపార్ట్మెంట్‌లలో బాంబు పేలితే, ఆ భవనం కూలిపోతే ఏం చేయాలి, సైరన్ మోగినప్పటి నుంచి చివరికి వారు రెస్క్యూ చేసి హాస్పిటల్‌కి చేర్చేదాకా వివిధ రకాల డ్రిల్స్‌ని అధికారులు చూపించారు. అకస్మాత్తుగా ఏదైనా విపత్తు సంభవిస్తే, విపత్కర, సంక్షోభ పరిస్థితులు ఎదురైతే, యుద్ధం వల్ల బాంబులు పడి లేదా గ్యాస్ లీక్, షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే, అలాంటి సమయంలో ప్రభుత్వం ఏవిధమైన సహాయ చర్యలు తీసుకుంటుంది, వివిధ ప్రభుత్వ శాఖలు ఎటువంటి చర్యలు చేపడతాయి, ఆయా శాఖల సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను ఏవిధంగా కాపాడతారన్న అంశాలను కళ్లకు కట్టినట్టు చేసి చూపించారు. బాంబులు, ఇతర పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే విధానాన్ని వివరించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ, ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్ తదితర శాఖలు ఈ విన్యాసాల్లో భాగస్వాములయ్యాయి. పైఅంతస్తులో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడికి అగ్నిమాపక సిబ్బంది చేరుకోవడం, క్షతగాత్రులను కిందకి దించడం, వారికి వైద్య సహాయాన్ని అందించడం, హుటాహుటిన అంబులెన్సు ద్వారా ఆసుపత్రికి తరలించడం, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సహాయ పడటం, అప్పటికీ పరిస్థితి అదుపులోనికి రాని పక్షంలో ఎన్డిఆర్ఎఫ్ దళాలు జత కలవడం, ప్రజల ప్రాణాలను రక్షించి, సహాయ చర్యలు చేపట్టడం తదితర అంశాలను ప్రత్యక్షంగా చేసి చూపించారు. మాక్ డ్రిల్ కార్యక్రమంలో అనకాపల్లి ఇంచార్జి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతి ప్రభ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఆర్.వెంకటరమణ, ఎన్‌డిఆర్ఎఫ్. ఇన్స్పెక్టర్ సుశాంత్ కుమార్, అగ్ని మాపక, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్.డి.ఆర్. ఎఫ్ దళాలు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది

రైతుకు తాత్కాలిక రైతు బజార్ కార్డు

- ప్రజాశక్తి కథనానికి స్పందన
- రైతులందరికీ ఇవ్వాలని పలువురు డిమాండ్

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి హోల్ సేల్ కూరగాయల మార్కెట్లో మంగళవారం బెండకాయలకు వ్యాపారులు కనీస ధర కూడా ఇవ్వకపోవడంతో రోడ్డుపై పారబోసిన చేనులపాలెం గ్రామానికి చెందిన రొంగల పైడితల్లికి మార్కెట్‌శాఖ అధికారులు తాత్కాలిక రైతు బజారు కార్డును బుధవారం అందజేశారు. దేవరాపల్లి హోల్ సేల్ కూరగాయల మార్కెట్లో మంగళవారం 15 కేజీల బెండకాయలను కెట్ రూ.20కు వ్యాపారులకు కొనుగోలు చేశారు. దీనిపై మనస్తాపంతో పైడితల్లి రోడ్డుపై బెండకాయలను పారబోశారు. ఈ విషయాన్ని ప్రజాశక్తి '15 కేజీల బెండకాయలు రూ.20' శీర్షికన వార్తా కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన అగ్రికల్చర్ ఏడిఏ వి.రవీంద్రనాథ్ ఆదేశాల మేరకు మాడుగుల మార్కెట్ కమిటీ సెక్రటరీ బంగార్రాజు బుధవారం చేనులపాలెం గ్రామంలో రైతు పైడితల్లి పొలానికి వెళ్లి తాత్కాలిక రైతు బజార్ కార్డును అందజేశారు. అయితే దేవరాపల్లి మార్కెట్లో కూరగాయలు విక్రయించే రైతులందరికీ రైతు బజారు కార్డులు ఇవ్వాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

చోడవరం సుగర్స్ పూర్వ వైభవానికి కృషి చేయాలి

ప్రజాశక్తి చోడవరం : చోడవరం సహకార చక్కెర కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సుగర్ ఫ్యాక్టరీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు అన్నారు. గోవాడలో కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 -2025 క్రషింగ్ సీజన్లో ఫ్యాక్టరీ పనితీరు పూర్తిగా పడిపోవడం వలన తలెత్తిన ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి ఫ్యాక్టరీ తిరిగి నిలదొక్కుకొని ముందుకు నడిపించడం కోసం రాజకీయాలు, యూనియన్లకు అతీతంగా రైతులు, కార్మికులతో సుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ సమితి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతేడాది కె.కోటపాడు మండలం గొండుపాలెం బహిరంగ సభలోనూ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన నాయకులకు వివిధ సందర్భాల్లోనూ, మంత్రి నారా లోకేష్ వడ్డాది బహిరంగ సభలోనూ సుగర్ ఫ్యాక్టరీ రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పదివేల మంది రైతులను స్వయంగా కలిసి వారి సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కార్మిక ప్రతినిధులు బండి శ్రీను, నూకరాజు, జగన్నాధరావు, సత్యనారాయణరాజు, అల్లం రామ అప్పారావు, బివి నూకరాజు, సూపర్వైజర్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసరాజు, రమణ రాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

విశాఖ డెయిరీ పాల సంఘాల వేతన కార్యదర్శులకు

ప్రజాశక్తి-సబ్బవరం : విశాఖ డెయిరీ పాల సంఘాల వేతన కార్యదర్శులకు కనీస వేతనాలు అమలు చేయాలని విశాఖ డెయిరీ పాల సంఘాల వేతన కార్యదర్శుల సంఘ అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ఇరువాడ దరి ఓ ప్రైవేటు గెస్ట్ హౌస్‌లో బుధవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వేలాది మంది వేతన కార్యదర్శులుగా సేవలందిస్తున్నా తమకు కనీస వేతనాలు అమలు చేయలేదని వాపోయారు.ఉపాధి హామీ కూలీకి రోజువారి ఇస్తున్న వేతనం కూడా తమకు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కనీస వేతనాలు అమలు చేయాలని, లేకుంటే తాము పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వేతన కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు జి. కనకారావు, కార్యదర్శి డి.సూర్యారావు, సంయుక్త కార్యదర్శి బి.ప్రసాద్,మ సభ్యులు జామి అప్పలనాయుడు, వేతన కార్యదర్శులు కరణం రామునాయుడు, గండి సూర్యనారాయణ, తాసుబిల్లి కనకరాజు, మేడపురెడ్డి బ్రహ్మయ్య, గండి అప్పారావు, ఎం.వెంకటస్వామి, చిరంజీవి, ఎస్.చిన్నంనాయుడు, జె.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మైనర్స్ డ్రైవింగ్ నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి అనకాపల్లి రూరల్ : మైనర్స్ డ్రైవింగ్ నియంత్రణే లక్ష్యంతో అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద తనిఖీలు చేసి, డ్రైవింగ్ చేస్తున్న పలువురు మైనర్లను పట్టుకున్నారు. వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్కు పిలిచి కౌన్సిలింగ్ చేశారు. మైనర్స్ డ్రైవింగ్ వల్ల తలెత్తే సమస్యలను, పడే శిక్షల గురించి వివరించారు. మైనర్ డ్రైవింగ్‌కు ఫైన్ విధించి తదుపరి వాళ్ళ తల్లిదండ్రులకు అప్పగించారు. అనకాపల్లి ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ, ట్రాఫిక్ ఎస్ఐ శేఖర్ పాల్గొన్నారు

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం గ్రంథాలయ అధికారి వి.శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలు చెప్పారు, రామాయణం గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు పాణి, పాఠశాలల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం పుస్తక పఠనం, స్టోరీ టెల్లింగ్, భగవద్గీత శ్లోకములను వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నర్సింగబిల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ కుమార్, గ్రంథాలయ అధికారి జగన్ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం రిసోర్స్ పర్సన్ జి హైమావతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, భాషలకు వన్నె తెచ్చేది వ్యాకరణాలు తెలియజేశారు. విద్యార్థులతో శతకాలు , పద్యాలు చదివించి అర్థాలను వివరించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ నీతి కథలు వినిపించి వివరించారు. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చొరవతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకొచ్చిన పాఠశాల సమస్యలపై స్పందించి గ్రంథాలయాధికారిని దమయంతి పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాలతో ఉపయోగాలు, విద్యార్థులకు సెల్ ఫోన్ ఎంతవరకు అవసరం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ములగాడ : యోగాతో ఒత్తిడి నివారణతోపాటు ఏకాగ్రత పెరుగుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని, మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బాలల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం యోగా తరగతులను ప్రారంభించారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్, ఉద్యోగ నైపుణ్యాలపై యువజన నాయకులు కృపారాణి, శేషు, రామారావు, సుజన వివరించారు బాలలందరూ కొత్త ఇంగ్లీషు పదాలను నేర్చుకున్నారు.

నాటుసారా తయారీ, అమ్మకం చేయొద్దు

ప్రజాశక్తి-కె.కోటపాడు : నాటుసారా తయారీ, అమ్మకం చట్టరీత్యా నేరమని, ఎవరూ ఆ పనులు చేయొద్దని చోడవరం ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ కెవి పాపునాయుడు హెచ్చరించారు. మండలంలోని శృంగవరం శివారు కొత్త భూమిలో నాటుసారా తయారీ అమ్మకం చేయొద్దంటూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా కేసుల్లో చిక్కుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. మండలంలో 20 కేసుల్లో 22 మంది వ్యక్తులను అరెస్టు చేసి 125 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు, 54 వేల లీటర్ల బెల్లం పులుపులను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటు సారా తయారీ అమ్మకాలు జరిపే 50 మంది వ్యక్తులను గుర్తించి కె.కోటపాడు తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ కె.హనుమంతు ఎం.శేఖరం, గ్రామ సర్పంచ్ సింగంపల్లి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శుభం సినిమా యూనిట్ సందడి

ప్రజాశక్తి-అనకాపల్లి : శుభం సినిమా యూనిట్ అనకాపల్లిలో సత్యనారాయణ థియేటర్లో బుధవారం సందడి చేసింది. సినిమా సక్సెస్ నేపథ్యంలో రాష్ట్ర పర్యటనలో భాగంగా అనకాపల్లి వచ్చారు. థియేటర్లో సినిమా హాల్ గ్యాలరీపైకి వెళ్లి ప్రేక్షకులతో మాట్లాడారు. అందరికీ నచ్చేలా సినిమా తీశామని అందరూ ఆదరించి సక్సెస్ ఇవ్వాలని కోరారు. హీరో హీరోయిన్లను అభిమానులు కలిసేందుకు పోటీపడ్డారు. మూవీ డైరెక్టర్ కాండ్రేగుల ప్రవీణ్, హీరోలు గవిరెడ్డి శ్రీనివాస్, హర్షిత్, చరణ్, హీరోయిన్సు శ్రావణి, షాలిని, శ్రేయ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రంలో బుచ్చయ్యపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్పి కాసనాయుడు పాల్గొన్నారు.

మేయర్ పీలాను కలిసిన నాగజగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావును శాసన మండలి మాజీ సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించడానికి అన్ని ఏర్పట్లు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమౌతుందని, 18 -35 సంవత్సరాల మధ్య గల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. 10 తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ, బి.టెక్, పిజి చదివిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని చెప్పారు. విద్యార్హత పత్రాల జెరాక్స్ కాపీ, ఆధార్, రెండు ఫోటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. 40 కంపెనీలు పాల్గొని సుమారు 2,500 ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఈ ఇంటర్వ్యూలు జరగనున్నాయని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి పెదపల్లి సబ్ స్టేషన్ 33-11 కెవి పరిధిలో శుక్రవారం ట్రీ కటింగ్, మెయింటెనెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు అనకాపల్లి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల పెద షేకిళ్లపాలెం, చిన షేకిళ్ల పాలెం, గొల్లల పాలెం, పెదపల్లి, మంత్రి పాలెం, కొక్కిరాపల్లి, రామనగర్, మర్రిబంద, ఎర్రవరం, ఎ ఎస్ ఆర్ కోలనీ , పురుషోత్తపురం, పోతిరెడ్డిపాలెం, రుక్మిణీపురం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

అనకాపల్లి : 33/11 కేవీ కసింకోట సబ్ స్టేషన్ మరమ్మతుల హెచ్‌టి/ ఎల్‌టి లైన్ల కింద ఉన్న చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలోని కొత్తూరు, మూలపేట, సత్యనారాయణపురం, పిసినికాడ గ్రామాలకు ఈనెల 16న ఉదయం 9 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని కసింకోట ఇఇ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని 12 రైతు సేవా కేంద్రాలు పరిధిలో 8 గ్రామాల రైతులకు రూ.32.13 లక్షలు విలువ చేసే 14 పవర్ టిల్లర్లను స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి బుధవారం అందజేశారు. 63 రకాల వివిధ వ్యవసాయ పనిముట్లు - నాగలి సెట్లు, దమ్ము సెట్లు, రోటవేటర్లు, పవర్ విడర్, పురుగు మందులు పిచికారి చేసే స్ప్రేయర్లు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి ఎల్వై కాంతమ్మ, టిడిపి నేతలు ఏసుదాస్, పోతల పాత్రు నాయుడ్జీ, కిలపర్తి భాస్కరరావు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరకన సూర్యనారాయణ, పెద్దాడ వెంకటరమణ పాల్గొన్నారు.

రక్షణ దళం కుటుంబాలను గౌరవిద్దాం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో దేశ రక్షణకు పనిచేస్తున్న ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, బిఎస్ఎఫ్, ఇతర దళాల్లో పనిచేస్తున్న రక్షణ దళాల్లోని సైనిక ఉద్యోగుల కుటుంబ సభ్యుల్ని గౌరవించుకొనే కార్యక్రమం చేపట్టబోతున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ పిళ్లా రమాకుమారి తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సైనికుద్యోగుల ఇళ్లకు పన్ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రక్షణ దళ బిడ్డ యొక్క తల్లిదండ్రులను గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందంటూ 17వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు జాతీయ పతాకాన్ని వారి వారి ఇళ్లపై ఎగురవేసి వారిని సత్కరించే కార్యక్రమంలో అందరూ పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.

మండుటెండల్లో శ్రమిస్తే రోజు కూలి రూ.150

-పీడీని ప్రశ్నించిన ఉపాధి హామీ కూలీలు



పీడీతో మాట్లాడుతున్న కూలీలు

ప్రజాశక్తి -కొత్తకోట:మండే ఎండల్లో రోజంతా కష్ట పడితే రూ 150 కూలి ఇస్తున్నారని. ఆరు రోజుల పనికి నాలుగు రోజులే మస్త ర్లు వేస్తున్నా రంటు రావికమతం మండల కార్యాలయం వద్ద పలువురు ఆదివాసీ ఉపాధి కూలీలు పలుగు, పారలతో సోమవారం చేపట్టిన నిరసనకు ఎన్ ఆర్ ఈ జీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.పూర్ణిమాదేవి స్పందించారు. ఈ ఘటనపై బుధవారం రావికమతం మండలం చీమలపాడులో ఉపాధి హామీ కూలీలతో ఆమె సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా కూలీలు పలు సమస్యలు ఆమె దృష్టికి తెలిపారు. ఆదివాసీ గిరిజన గ్రామాలలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు మండు టెండలో పని చేస్తున్నప్పటి ఉపాధి కూలి గిట్టు బాటు కాలేదని, మండే ఎండల్లో శ్రమిస్తే ఉపాధి. హామీ కింద కేవలం రూ. 150 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఇది సబబేనా అంటూ ఉపాధి శ్రామికులు పిడిని ప్రశ్నించారు. పంచాయతీ పరిధి లో చీమలపాడు, కళ్యాణపు లోవ గ్రామాలకు చెందిన సుమారు 80మంది వరకు ఉపాధి పనులు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం రోజుకు రూ.307 ఇవ్వాలని నిబంధనలు ఉన్నా ఉపాధి శ్రామికులకు అన్యాయం జరుగుతోందని, మెడికల్ కిట్లు లేవని, టెంట్ ఉండదని, తాగు నీళ్లు దొరకవని, ఆరోపించారు. పనికి రాని వారి పేర్లు తో మస్టర్లు వేస్తున్నారని ఆరోపించారు. పనికి తగ్గ వేతనం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఉపాధి హామీ పథకం కార్డులున్నా ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డిమాండ్ చేసారు.. దీనిపై స్పందించిన పిడి పూర్ణిమా దేవి మాట్లాడుతూ, గతంలో జరిగిన పొరపాట్లను సరి దిద్ది న్యాయం చేస్తామన్నారు. పొలాలకు రోడ్లు, జీడీ మామిడి తోటలలో ఉపాధి పనులకు మండల అధికారులతో చర్చించి పనులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తప్పు చేస్తే విఆర్‌పిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు, ఉపాధి కూలీలు గోరా వెంకటరమణ, బొండ చిన్న దేవుడు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: అనకాపల్లి జిల్లా ఉపాధి హామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమాదేవి పలు గ్రామాల్లో ఆకస్మికంగా సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో గర్నెకం గ్రామంలో నూతనంగా నిర్మించిన పశువుల తొట్లెను ఆమె పరిశీలించారు. అనంతరం రావికమతం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్థాయి క్షేత్ర సహాయకులు, కార్యాలయం సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలో ఉపాధి హామీ సిబ్బంది అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. ఫారం పాండ్స్ ,కంపోస్ట్ పిట్స్, పశువుల తొట్లెలు, పశువుల షెడ్ల పనులకు ప్రాధాన్యత కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

అల్లూరి స్మారక మందిరానికి రూ. 20 లక్షల కేటాయింపు

-స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-అనకాపల్లిదేశ్యంరాష్ట్రంలోనే అల్లూరి స్మారక మందిరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్న లక్ష్యంతో అవసరమైన చర్యలు చేపట్టినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో అల్లూరి స్మారక మందిర అభివృద్ధిపై బుధవారం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో పార్క్ ఆవరణలో స్పీకర్ సమావేశం నిర్వహించారు. అనంతరం పార్కు ను సందర్శించి లోటుపాట్లు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కొంతమేర నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన అనంతరం పర్యాటక శాఖామంత్రితో చర్చించి, అల్లూరి పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు స్పీకర్ చెప్పారు. పార్కులో సోలార్ లైట్లతో పాటు, డైనింగ్ హాలు, టాయిలెట్లు వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అల్లూరి సమాధులను ఆధునీకరించడం, సమాధుల భవనంలో పైకప్పుకు మరమ్మతులు చేయించడం, గ్రోడాలు(షెడ్లు) కు మరమ్మతు చేయించి క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదన సిద్ధం చేస్తున్నట్లుగా తెలిపారు. పర్యాటకులు, విద్యార్థుల కోసం అల్లూరి చరిత్ర బయోగ్రఫీ వీడియోలను అందుబాటులో ఉంచి, పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా సందర్శన ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పర్యాటక శాఖ ఆర్థిక సహాయంతో పాటు ఎంపీలకు కేంద్రం మంజూరు చేసిన నిధులను కూడా ఈ అభివృద్ధి పనులకు వినియోగించేందుకు తాను ప్రయత్నించానని తెలిపారు. ఇందులో భాగంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్ రావు చెరో రూ. 10 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు ప్రకటించారు. మిగిలిన ఎంపీలు కూడా నిధులు కేటాయించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిధులు కేటాయించిన ఇద్దరు ఎంపీలకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ అధికారులు ఈఈకే. విజయభాస్కర్‌రెడ్డి, డి.ఈ.ఎస్.జి. సత్యనారాయణ, పి.సీతారాం, టూరిజం మేనేజర్ సూరెడ్డి అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు అడిగర్ల నానిబాబు, మాజీ జెడ్పిటిసి చిటికెల తారకవేణు గోపాల్, చోద్యం సర్పంచ్ ఆదిపరెడ్డి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొమర్రాజు లక్ష్మణరావు గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలుగు జాతి సంస్కృతీ వైతాళికుడు కొమర్రాజు లక్ష్మణరావు జీవిత సాహిత్య కృషిని గురించి విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి కొమర్రాజు లక్ష్మణరావు పేరుతో ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు ఆచార్య వెలమల సిమ్మన్న, విజయవాడ ఆంధ్ర లయోల కళాశాల విశ్రాంత తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు రచించిన గ్రంథాన్ని ఆంధ్ర విశ్వకళాపరిషత్ హిందీభవన్‌లో పద్మభూషణ్, కేంద్ర ప్రభుత్వ హిందీ సలహా మండలి సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమర్రాజు గర్వించదగిన మహా వ్యక్తి అని అన్నారు. ఈ తరానికి ఆ మహనీయుడి ఘనత తెలియదని ఆ లోటు తీర్చడానికి సిమ్మన్న, సాంబశివరావులు ఈ అమూల్యమైన గ్రంథం రచించారని పేర్కొన్నారు. రచయితలను అభినందించి సత్కరించారు. గ్రంథ సమీక్ష చేసిన డాక్టర్ డివి.సూర్యారావు కొమర్రాజు రచనలను సేకరించి విమర్శనాత్మక దక్షతతో ఆయన చరిత్ర గ్రంథాలను, శాస్త్ర రచనలను భాషా శాస్త్ర పరిశోధనను విశ్లేషించి భావితరాలకు ఉపయుక్తమయ్యే రీతిలో ప్రామాణిక గ్రంథం వెలయించారని చెప్పారు. నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడారు. కొమర్రాజు లక్ష్మణరావు మనుమడు విశ్రాంతాచార్యులు కొమర్రాజు రవి తమ కుటుంబ విశేషాలను వివరిస్తూ బండారు అచ్చమాంబ, కొమర్రాజు అచ్చమాంబ డాక్టర్ కెవెల్.రావు కృషిని ప్రస్తావించారు. రచయితలు సిమ్మన్న, సాంబశివరావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లోక్ నాయక్ ఫౌండేషన్ కార్యదర్శి ఆచార్య నల్లా బాబయ్య, పలువురు ఆచార్యులు, సాహితీ ప్రముఖులు పరిశోధకులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -కొత్తకోట: ఆదివాసి గిరిజన గ్రామం చలిసింగంను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు అన్నారు. బుధవారం రావికమతం మండలం చీమలపాడు శివారు కొండ పై ఉన్న చలిసింగంలో ఆయన పర్యటించారు. గ్రామంలో తాగునీటి సమస్య ను నివారించేందుకు ఇన్ఫోసిస్, నవనిర్మాణ సంస్థ సంయుక్తంగా రూ 5 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి రక్షిత పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి పనులు చురుగ్గా సాగడం పట్ల ఆనందం వ్యక్తం చేసారు. జల జీవన్ మిషన్ ద్వారా బోర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా తాగునీటి సరఫరా విభాగం అధికారులకు సూచించారు.. గ్రామంలో పలువురు అనారోగ్యంతో ఉన్నట్లు గ్రామస్తులు తెలపగా తక్షణమే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ముందుగా రోడ్డు పనులను పరిశీలించి తగు సూచనలు చేసారు. ఈ కార్యక్రమం లో మండల టిడిపి నాయకులు కోట గోవిందరావు, బంటు శ్రీను, వై.ఆచారి పాల్గొన్నారు.



ఫిర్యాదు పత్రాన్ని ఇస్తున్న టిడిపి నాయకులు

జగన్న కాలనీ భూముల కొనుగోలుపై విచారణ చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: గతంలో వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీ పేరిట భూములు కొనుగోలు వ్యవహారంపై విచారణ జరిపించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కౌన్సిలర్లు బుధవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలో గత ప్రభుత్వంలో జగన్న కాలనీ ఇంటి స్థలాల కోసం సేకరించిన భూముల కొనుగోలుపై విచారణ జరిపించాలని వారు కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు మాట్లాడుతూ, అప్పటి ఎమ్మెల్యే గణేష్ తన అనుచరుల ద్వారా నాలుగు మండలాల్లో రైతుల నుండి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి, ప్రభుత్వానికి అధిక ధరకు విక్రయించి లక్షల రూపాయలు అక్రమంగా సంపాదించారని అన్నారు. ప్రభుత్వాన్ని, రైతులను మోసం చేశారని దీనిపై సీఐడీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రుత్తల కృష్ణ, శ్రీకాంత్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రావికమతం: ఉపాధి హామీలకు ఎండల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ఉదయం 6 గంటలకు పని ప్రదేశానికి వచ్చే విధంగా సహకరించాలని కవగుంట సర్పంచ్ దాసరి కుమారి వరహాలు తెలిపారు. ఉపాధి కూలీలతో బుధవారం పని ప్రదేశం వద్ద సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రభుత్వం కేటాయించిన రోజు వారి వేతన కూలి 307 రూపాయలు ప్రతి ఒక్కరూ పొందేలా పనిచేయాలని కోరారు. 100 రోజుల పనిని పూర్తి చేసుకోవాలన్నారు. క్యూబిక్ మీటర్ రేటు ప్రకారం కొలతలు తీసుకొని పనిచేసుకోవాలన్నారు. దాని ప్రకారమే వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. జాబ్ కార్డు లేకపోతే తమ దృష్టికి తీసుకు రావాలని తెలిపారు.

16న రావికమతం మండల సమావేశం

ప్రజాశక్తి-రావికమతం: ఈనెల 16న రావికమతం మండల సర్వసర్వ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ, మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపిటిసిలు, గ్రామ సర్పంచ్లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు పూర్తి సమాచారంతో అధికారులు హాజరు కావాలని ఆయన తెలిపారు.



రక్షణ కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రధాన రహదారికి ఆనుకొని సాయి నగర్ కు వెళ్లే రహదారికి ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. చేతికి అందే ఎత్తులో ఉండే ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎటువంటి రక్షణ కంచె లేకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతం కావడంతో సమీపంలో రైతులు పశువులు వేపుకుంటూ ఉంటారు, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.


చెక్కును అందజేస్తున్న స్పీకర్ అయ్యన్న

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం మండలం అమలాపురం గ్రామానికి చెందిన శెట్టి స్వామి నాయుడుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.56 వేలు విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి గొప్ప భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి అనేక పేద కుటుంబాలకు ఆపద సమయంలో ఆశ్రయంగా మారిందన్నారు. గత పది నెలల్లో నియోజకవర్గంలోని 25 మందికి పైగా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండల టీడీపీ అధ్యక్షుడు లాలం శ్రీరంగంస్వామి, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పి

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకండి

-ఎస్పి తుహిన్‌సిన్హా

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రజా ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా పరిష్కరించాలని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా తెలిపారు. బుధవారం మాకవరపాలెం మండలంలో పోలీస్ స్టేషన్ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేర చరిత గలవారు, అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు, గంజాయి రవాణా పై వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల, విద్యార్థుల పట్ల ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మహిళా చట్టాలు, శక్తి యాప్‌పై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు, ప్రధాన కూడళ్ళ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుపై నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రేవతమ్మ, స్థానిక ఎస్సై పాల్గొన్నారు.

వైద్యాధికారిగా పుష్పలత

ప్రజాశక్తి- రావికమతం:ఇటీవల కాలంగా రావికమతం పీహెచ్సీలో వైద్యాధికారిగా పనిచేసిన దుర్గప్రసాద్ బదిలీ కావడంతో ఆ స్థానంలో డి.పుష్పలత నూతన వైద్యాధికారిణిగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. గర్భిణి స్త్రీలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తానని తెలిపారు.



ఎయిడ్స్‌పై కళాజాతా

ప్రజాశక్తి-చింతపల్లి: ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణంలో నాగ సాయి కళాబృందం ఆధ్వర్యంలో ప్రాంతీయ ఆసుపత్రి ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్ నెల్లి గోవింద్ పర్యవేక్షణలో కళాజాతా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఇంద్ర ప్రియాంక హాజరై మాట్లాడుతూ, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

రూ.13.50 కోట్లతో నిర్మాణం... ఆపై 'వేలం'?

▸▸సాగర్‌నగర్‌లోని ఎపిఇపిడిసిఎల్ ట్రైనింగ్ భవన్‌పై విఎంఆర్‌డిఎ నిర్ణయం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సాగర తీరానికి అభిముఖంగా ఇస్కాన్ టెంపుల్ పక్కన సాగర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన ఎపిఇపిడిసిఎల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ భవనాన్ని విఎంఆర్‌డిఎ వేలానికి పెట్టింది. గడిచిన కొన్ని నెలలుగా విద్యుత్ శాఖ భవన్ నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అది సిద్ధమైంది. ఎపిఇపిడిసిఎల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ నిమిత్తం దీన్ని రూ.13.50కోట్లతో నిర్మాణం చేపట్టారు. తాజాగా దీంట్లో గ్రౌండ్ ఫ్లోర్‌ను మాత్రమే ట్రైనింగ్ కోసం వాడుకోడానికి నిర్ణయించారు. మిగతా రెండు అంతస్తుల్లోని ఆఫీసు స్థలాన్ని నెలసరి అద్దె చెల్లింపు ప్రాతిపదికపై ఇచ్చేందుకు విఎంఆర్‌డిఎ టెండరు కమ్ వేలానికి ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేసింది. పూర్తి వివరాల కోసం విస్తీర్ణం, అద్దె, విఎంఆర్‌డిఎ అప్‌సెట్ ధర కోసం వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యు.విఎంఆర్‌డిఎ.జిఒవి.ఇన్ నందు పొందుపరిచినట్లు విఎంఆర్‌డిఎ వెల్లడించింది. స్థలాన్ని యథాతథంగా 3 ఏళ్లపాటు నెలసరి అద్దె ప్రాతిపదికపై వేలం వేసేందుకు నిర్ణయించారు. ఆసక్తిగల వారు దరఖాస్తులను విఎంఆర్‌డిఎ వెబ్‌సైట్ నందు గాని సిరిపురంలోని కార్యాలయం 8వ అంతస్తులోని రెవెన్యూ విభాగం వద్ద తీసుకోవచ్చు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చలానా, డీడీలు విఎంఆర్‌డిఎకు అందజేయాల్సి ఉంటుంది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సిరిపురంలో దరఖాస్తు రుసుము ఒక్కొక్క అంతస్థునకు రూ.5000, చలానా రూపంలో చెల్లించాలి. దరావత్తు సొమ్ము (ఇఎండి) ఒక్కొక్క దానికి రూ.లక్ష చొప్పున విఎంఆర్‌డిఎ ది



మెట్రోపొలిటన్ కమిషనర్ విశాఖపట్నం పేరున డీడీ తీసి దరఖాస్తులను పైన తెలిపిన అడ్రస్‌కు అందజేయాలని విఎంఆర్‌డిఎ వెల్లడించింది. బహిరంగంగా ఈ పై రెండు అంతస్తుల వేలం ప్రక్రియను జూన్ 3వ తేదీన ఉదయం 11గంటలకు సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ థియేటర్‌లో నిర్వహించనున్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి


మాధరధారలో ప్రచారం చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈనెల20న జరిగే దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో పోర్టు కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం పోర్టులోని మెరైన్ సిహెచ్‌డి, ఆర్ అండ్ యార్డ్ డిపార్ట్మెంట్లలో గేటు మీటింగ్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు రమణ బాబు, పోతన్న, మంగయ్య నాయుడు, కె.సత్యనారాయణ, జె. సత్యనారాయణ, త్రినాధరావు, బి.లక్ష్మణరావు, ఎన్.కనకారావు, చందు పాల్గొన్నారు.

రేపు బైక్ ర్యాలీ

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 20వ తేదీన అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం 9:30 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, ఈ ర్యాలీలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు విశాఖ నగరంలో నూటికి నూరు శాతం సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెం పిఠాపురం కాలనీలో ముఠా కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమ్మెలో ముఠా కార్మికుల పాల్గొవాలని ముఠా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

మాధవధార: జివిఎంసి 51వ వార్డు కళింగనగర్ 48ఎ బస్‌స్టాప్ వద్ద జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జాతీయ సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్త సమ్మె జయప్రదానికి శానిటరీ శ్రామికుల విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. 20న జాతీయ సమ్మెలో పలు రంగాల కార్మికులంతా పాల్గొనాలని నిర్ణయించినట్లు వెల్లడించారు జోన్ నాయకులు ఎస్.శ్రావణ్‌కుమార్, వార్డ్ కమిటీ మెంబర్లు దేవి, లక్ష్మి, కుమారి, పోలయ్య, భద్ర, దాలయ్య, సాదురావు, సంతోష్, చిన్ని, కృష్ణ, ఎంకన్న, పాల్గొన్నారు.

గాజువాక.: కేంద్ర ప్రభుత్వకార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని బుధవారం భెల్ ట్రైనింగ్ సెంటర్లో అఖిలపక్ష కార్మిక సంఘాలు నిర్ణయించారు. బుధవారం గుర్తింపు యూనియన్ అధ్యక్షులు బి బాబురావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ సాహు, సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్, ఇంటక్ నేత సీత నాయుడు, కొల్లి దేవుడు, అల్లు అప్పారావు, పి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



చీడికాడలో...


కె.కోటపాడులో..

అఖిలపక్ష కార్మికసంఘాలన్నీ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. టిఎన్‌టియుసి నేతలు, కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

అనకాపల్లి : దేశ వ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను సిఐటియు కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో జీవిఎంసి ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోకాడ దేముడు నాయుడు, జివిఎంసి యూనియన్ నాయకులు నిమ్మకాయల అజయ్, పోట్నూరి గోవిందు, సంతోష్, ఎస్, నూకరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : దేశ వ్యాప్త సమ్మెలో ఆటో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా గండి నాయన బాబు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఆటో కార్మికులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు సంఘం అధ్యక్షులు మెల్లి అప్పలనాయుడు , బండారునాయుడు, ఈశ్వర్‌రావు, పాల్గొన్నారు.

చీడికాడ :గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి ఆర్.దేముడునాయుడు డిమాండ్ చేసారు. బుధవారం మండలంలోని కోణం పంచాయతీ పరిధిలో ఉన్న వివిధ గ్రామాలు కొండల కొత్తూరు, చిన్న కోణం ప్రాంతాల్లో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ, మండలంలో సుమారు 50 లక్షల వరకు బకాయలు ఉన్నాయన్నారు. 6 వారాల నుండి బిల్లులు చెల్లించక పోవడంతో కూలీలు పస్తులు ఉంటున్నారని తెలిపారు. పని చేసిన ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి రెండు వందల రోజుల పని కల్పించాలన్నారు.

లేటరైట్ పేరుతో రూ. 2వేల కోట్ల దోపిడీ

మాజీ ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:అనకాపల్లి జిల్లా నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న నాతవరం మండలం సుందరకోట పంచాయతీ పరిధిలో జర్తా లక్ష్మణరావు అనే గిరిజనుడి పేరుతో భమిడిక లొద్ది గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా లేట్ రైట్ తవ్వి స్పీకర్ అయ్యన్నపాత్రుడు వేల కోట్లు దోపిడీ చేస్తున్నారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన



విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లేట్ రైట్ పేరుతో అత్యంత విలువైన బాక్సైట్‌ను తవ్వి, వేల కోట్లు స్పీకర్ దోచుకుంటున్నారని ఆరోపించారు. స్పీకర్ రోజు సంపాదన కోటి 50 లక్షల రూపాయలు అని అన్నారు. 15 రోజులుగా లేట్ రైట్ తవ్వుతున్నారని ఇప్పటివరకు 45 కోట్ల దోచుకున్నారని తెలిపారు.ఇదే తరహా లో అక్రమ లేట్ రైట్ తవ్వకాలు జరిపితే ఏడాదికి 540 కోట్లు దోచుకుంటారని వివరించారు. ఇప్పుడు టన్ను 3720 రూపాయలు ఉందని ఈ లెక్కన రాబోయే 4 ఏళ్లలో తవ్వకాలు జరిపితే 75 వేల కోట్లు లేట్ రైట్ పేరుతో దోపిడికి పాల్పడబోతున్నారని పేర్కొన్నారు. మైనింగ్ లీజు పై కేసు పెండింగ్ లో ఉండగా ఇప్పుడు తవ్వకాలు ఎలా జరుపుతున్నారని నిలదీశారు. జర్తా లక్ష్మణరావు గిరిజనుడు కాదని స్వయంగా అయ్యన్నపాత్రుడే గతం లో ప్రతిపక్షం లో ఉన్నప్పుడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో ఫిర్యాదు చేశామని, 15 రోజులైనా ఎలాంటి స్పందన రాలేదన్నారు. అధికారులు పట్టించుకోకపోతే ఉద్యమాలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే గణేష్ హెచ్చరించారు.